PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 312 | విజయవాడ, సోమవారం 17 జూన్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 17 June 2024 | Rs

అసమానతలు.. అరకొర వేతనాలు

- అసంఘటిత రంగంలో 11 కోట్ల మంది కార్మికులు
- దశాబ్దం తర్వాత తొలిసారి సమాచారాన్నిచ్చిన కేంద్రం

లోపలి పేజీలో..



సూపర్‌8కు ఇంగ్లాండ్

- నమీబియాపై 41 పరుగులతో గెలుపు
- వరుణుడు భయపెట్టినా గట్టెక్కిన ఇంగ్లాండ్

6



పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారాయణకు మిఠాయిలు తినిపిస్తున్న రాజధాని ప్రాంత రైతులు

పాత ప్లాన్ ప్రకారమే అమరావతి

- రాజధాని అభివృద్ధి పనులు రెండున్నరేళ్లలో పూర్తి
- మూడు వారాల్లో అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ
- మున్సిపల్‌శాఖ మంత్రి పి నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్ ప్రకారమే చేపట్టనున్నట్లు మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. రాజధాని అభివృద్ధికి తొలిదశలో రూ.48 వేల కోట్లతో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించి దాదాపు రూ.9 కోట్లు చెల్లింపులు కూడా గతంలో చేశామన్నారు. సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో మంత్రిగా ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాజధాని అమరావతి అభివృద్ధి పనులను రెండున్నరేళ్లలో పూర్తి చేస్తామన్నారు. అమరావతిని ప్రపంచంలోనే తొలి ఐదు అత్యుత్తమ రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఉత్తమమైన డిజైన్‌ను రూపొందించామన్నారు. రాజధానిలో చేపట్టే ఎటువంటి అభివృద్ధి కార్యక్రమమైనా రాష్ట్రంలోని అన్ని జిల్లాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా సింగపూర్ ప్రభుత్వ సహాయంతో అత్యుత్తమమైన డిజైన్‌ను రూపొందించి అమలు పరిచామన్నారు. రాజధానిలో మెజార్టీ ప్రాంతం కవరయ్యేలా మౌలిక వసతుల కల్పనతోపాటు మంత్రులు, కార్యదర్శులు, అధికారులు, ఉద్యోగుల నివాసాలకు సంబంధించి భవనాల నిర్మాణానికి తొలిదశలో పనులు చేపట్టేందుకు గతంలో రూ.48 వేలకోట్లు అవుతాయని అంచనా వేశామన్నారు. మంత్రుల కార్యదర్శులు, అధికారులు, ఉద్యోగుల నివాసాలకు సంబంధించి భవనాల నిర్మాణం కూడా 90 శాతం పూర్తయినట్లు ఆయన తెలిపారు. తొలిదశ పనులతో సిటీ నిర్మాణ పనులు పూర్తవుతాయని, రెండో దశలో మెట్రో రైలు నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. బాధ్యతలు మిగతా 2లో

ఉరుములు, మెరుపులతో వర్షం

- పిడుగుపాటుకు ఇద్దరు మృతి

ప్రజాశక్తి - యంత్రాంగం

రుతుపవనాల ప్రభావంతో ఎన్‌టిఆర్, తూర్పుగోదావరి, కర్నూలు జిల్లాల్లో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. భారీ ఈదురుగాలులకు రహదారులపై చెట్లు విరిగిపడ్డాయి. పలుచోట్ల విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో పిడుగుపాటుకు ఇద్దరు గొర్రెల కాపరులు మృతి చెందారు. రామలింగయ్యపల్లి గ్రామానికి చెందిన కాపరులు ఎరుకల సుంకన్న (46), ఎరుకల కామేశ్వరి (35), మరో ఇద్దరూ చెన్నంపల్లి కొండల్లో గొర్రెలను మేపుతుండగా.. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో కాపరులు చెట్టుకిందకు వెళ్లారు. వారున్నచోట పిడుగు పడటంతో సుంకన్న, కామేశ్వరి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఎన్‌టిఆర్ జిల్లా గన్నవరం విమానాశ్రయంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం సరిగాలేక బెంగళూరు విమానం సుమారు గంటపాటు గాల్లో చక్కర్లు కొట్టింది. బెంగళూరు నుంచి సాయంత్రం 6.20 గంటలకు గన్నవరం వచ్చిన విమానం ల్యాండింగ్‌కు అవకాశం లేకపోవడంతో 7.20 గంటల వరకు గాల్లోనే చక్కర్లు కొట్టాల్సి వచ్చింది. ఆ తర్వాత విమానాశ్రయం నుంచి క్లియరెన్స్ రావడంతో ల్యాండ్ అయ్యింది. ఈ ఘటనతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఆ తర్వాత సేఫ్‌గా రన్‌వేపై దిగడంతో ఊపిరి పీల్చుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. గాలి వాన బీభత్సానికి చెట్లు విరిగి రోడ్డుపై పడడంతో గోపాలపురం నుంచి జగన్నాథపురం వరకు సుమారు పది కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలు విరిగి పడటంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

5 సంతకాల ఒరవడిలో ప్రజల ఆశలు నెరవేర్చాలి

కొత్త ప్రభుత్వాన్ని కోరిన సిపిఎం



ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

రాష్ట్రంలో తెలుగుదేశం కూటమిని ప్రజలు ఎన్నో ఆశలతో భారీ మెజారిటీతో గెలిపించారని, సంకీర్ణ ప్రభుత్వం ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా మంచిపాలన అందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. అధికారం చేపట్టగానే ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఐదు సంతకాలు చేయడాన్ని స్వాగతించారు. ఆదివారం విజయవాడలోని ఎంబివికెలో ఆయన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాంతో కలిసి మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఎన్‌డిఎ, మోడీ చరిష్మా దెబ్బతింటే దాన్ని కప్పిపుచ్చి బిజెపి రాష్ట్రంలో ఎన్‌డిఎ గెలుపు అని ప్రచారం చేసుకుంటోందని చెప్పారు. రాష్ట్రంలో ఏర్పడింది తెలుగుదేశం నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వమని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై పెత్తనం చేయాలని తెలుగుదేశం ఉనికిని కనపడకుండా చేయాలన్న ప్రయత్నంలో భాగంగానే బిజెపి ఎన్‌డిఎ ముసుగును తొడుగుతోందని అన్నారు. ఐదు సంతకాల ఒరవడిలోనే టిడిపి-జనసేన ఇచ్చిన మిగిలిన వాగ్దానాల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అమరావతి శాశ్వత రాజధానిగా నిర్ణయించేలా చట్టం చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసే విధంగా ప్రయత్నించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తికావాలంటే ముందుగా నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, పునరావాసం పనులను, నిర్వాసితుల కాలనీల ఏర్పాట్లను పూర్తి చేయాలని కోరారు. మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఏజెన్సీలో జిఓ నెంబర్ 3 పునరుద్ధరించి ఏజెన్సీ ప్రాంతాలకు స్పెషల్ డిఎస్‌సిని నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలో ఖాళీ టీచర్ పోస్టులతో పాటు మిగిలిన ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి విజ్ఞప్తి చేస్తామని తెలిపారు. స్మార్ట్ మీటర్లను తెలుగుదేశం వ్యతిరేకించిందని, మంత్రి నారా లోకేష్ గతంలో వాటిని ధ్వంసం చేయాలని కూడా పిలుపునిచ్చారని, ఇప్పుడు రైతుల నెత్తిపై కుంపటిలా ఉన్న స్మార్ట్ మీటర్లను ఉపసంహరించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో తెచ్చిన జిఓ 596ను రద్దు చేసి అసైన్డ్‌మెంట్ భూములు పేదలకే దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో జరిగిన భూదందాలు, మద్యం, స్మార్ట్‌మీటర్లు, బైజూస్, పోలవరం అవినీతిపై విచారణ జరిపించాలని కోరారు. అలాగే రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన హామీల సాధనకోసం, విశాఖ ఉక్కు పరిరక్షణకోసం, లౌకికతత్వం, ఫెడరలిజం, రాజ్యాంగ పరిరక్షణ తదితర అంశాల్లో ఒక లౌకిక పార్టీగా తెలుగుదేశం గట్టిగా నిలబడి రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించాలని కోరారు. రాష్ట్రంలో ఎన్నికల్లో 'ఇండియా' వేదిక తరుపున పోటీ చేసిన అభ్యర్థులకు ఓట్లు వేసిన ప్రజలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అరకు పార్లమెంట్, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిపిఎం అభర్థులకు మంచి ఓటింగ్ లభించిందని, ఆదివాసులు పార్టీని ఆదరించారన్నారు. మిగతా ప్రాంతాల్లో పార్టీ ప్రజా పునాది తగ్గిందని, సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసుకొని ప్రజా పునాదిని పెంచుకునే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు.

రాష్ట్ర కమిటీ ఆమోదించిన తీర్మానం పూర్తి పాఠం (2వ పేజీలో)

మెస్ ఛార్జీలు పెంచాలి

- ఉపాధ్యాయ, అధ్యాపక ఖాళీల భర్తీకి ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్
- ముగిసిన రాష్ట్ర ప్లీనరీ



'రుషికొండ' నిర్మాణాలపై త్వరలో నిర్ణయం

- ఎమ్మెల్యే గంటా

మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై దాడి

లోపలి పేజీలో..

నట్టేట పోలవరం నిర్వాసితులు

- పరిహారం, పునరావాసం కోసం ఎదురుచూపులు
- నేడు సిఎం చంద్రబాబు పర్యటన



గోదావరి వరదలకు ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో గుట్టలపై తలదాచుకున్న గిరిజనులకు ఆహార పొట్లాలు జార విడుస్తున్న హెలికాప్టర్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షలు, 2006కు ముందు సేకరించిన భూములకు రూ.ఐదు లక్షలు పరిహారం ఇస్తామని ఇచ్చిన హామీని వైసిపి ప్రభుత్వం విస్మరించింది. కాఫర్ డ్యామ్ పూర్తి కావడంతో వరదల సమయంలో ఏటా గ్రామాలన్నీ మునిగిపోతున్నాయి. పరిహారం అందించకపోవడం, గ్రామాలను తరలించకపోవడంతో నిర్వాసిత గిరిజనులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. పోలవరం జాతీయ ప్రాజెక్టు అయినందున దీని నిర్మాణానికి అయ్యే మొత్తం ఖర్చు కేంద్ర ప్రభుత్వమే భరించాలి. అయితే, కేంద్రంలోని మోడీ సర్కార్ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ వచ్చింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

పాలకుల నిర్వాకం ఫలితంగా పోలవరం నిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రాజెక్టు పూర్తి గురించి మాట్లాడుతున్నారే తప్ప, సర్వం కోల్పోయి చెట్టుకొకరు, పుట్టకొకరు అన్నట్లు బతుకీడుస్తున్న నిర్వాసితుల గురించి ఏ మాత్రమూ పట్టించుకోవడం లేదు. పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యాం పూర్తవడంతో ఏటా జులై, ఆగస్టుల్లో గోదావరి వరదలకు కుక్కునూరు, వేలేరుపాడు, చింతూరు, ఎటపాక, విఆర్ పురం, దేవీపట్నం మండలాల్లో వందలాది గ్రామాలు నీట మునుగుతున్నాయి. పరిహారం విషయంలో ఇచ్చిన హామీని గత వైసిపి ప్రభుత్వం నిలుపుకోలేకపోయింది. ఏటా వరదలకు గ్రామాలు నీటమునగడంతో జనం పునరావాస శిబిరాలకు, కొండలు గుట్టలపైకి వెళ్లి ప్రాణాలు కాపాడుకోవాల్సి వస్తోంది. 2022 వరదల అనంతరం పర్యటించిన అప్పటి ముఖ్యమంత్రి జగన్ అదే ఏడాది డిసెంబర్ కల్లా నిర్వాసితులకు పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. 2023లో వచ్చిన వరదలకు కుక్కునూరు మండలం గొమ్ముగూడెం విచ్చేసిన ఆయన 2024 జనవరి కల్లా పరిహారం ఇస్తామని చెప్పారు. తాము అధికారంలోకొస్తే పునరావాస ప్యాకేజీ రూ.6.25 లక్షల నుంచి రూ.పది లక్షలకు పెంచుతామని, 2006కు ముందు మిగతా 2లో

సుప్రీం నియమించిన అధికారులతో విచారణ

నీట్ స్కామ్‌పై కపిల్ సిబాల్ డిమాండ్



న్యూఢిల్లీ : నీట్ స్కామ్‌పై సుప్రీంకోర్టు నియమించిన అధికారులతో విచారణ జరగాలని రాజ్యసభ సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి కపిల్ సిబాల్ కోరారు. భవిష్యత్‌లో నీట్ పరీక్షను ఎలా నిర్వహించాలనే విషయంపై అన్ని రాష్ట్రాలతో కేంద్రప్రభుత్వం సంప్రదింపులు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షా విధానం అవినీతిమయమైందని వార్తలు వస్తున్నప్పుడు మన్నుతిన్నపాములా మిన్నకుండిపోవడం ప్రధాన మంత్రికి తగదని అన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశాన్ని బలంగా లేవనెత్తాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై చర్చకు మోడీ ప్రభుత్వం అనుకూలంగా ఉంటుందన్న నమ్మకం తనకు లేదని అన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)పై ప్రస్తుతం అనేక ఆరోపణలున్నాయని, దాని అవినీతిని మీడియా ఫ్లాట్‌ఫామ్స్ వెలుగులోకి తెచ్చాయని చెప్పారు. గుజరాత్‌లో జరిగిన కొన్ని సంఘటనలు తనతోపాటు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయని, ఇలాంటి తీవ్రమైన అంశాలకు ఎన్‌టిఎ సమాధానం ఇవ్వాలని చెప్పారు. హెచ్‌ఆర్‌డి మంత్రిగా గతంలో తాను పనిచేసినప్పటికీ, నీట్‌తో తనకు ఎటువంటి సంబంధంలేదని అన్నారు. ఎంబిబిఎస్ కోర్సులో ప్రవేశం పొందే విద్యార్థులకు జాతీయ స్థాయి అర్హత పరీక్ష ఉండాలని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సిఫార్సుల మేరకు నీట్ ప్రవేశపెట్టారని చెప్పారు. ఎంసిఐకు ఇలాంటి సామర్థ్యం లేదని దాఖలైన కొన్ని పిటీషన్ల విచారణ తరువాత సుప్రీంకోర్టు 2016లో నీట్‌ను సమర్థించిందని కపిల్ సిబాల్ గుర్తు చేశారు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్ 1956 చట్టం స్థానంలో 2019 ఆగస్టున నేషనల్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్‌ను ఆమోదించారని చెప్పారు. ఈ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దీనికి యుపిఎతో ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. నీట్ పరీక్షల్లో పేపర్ లీక్ లేదా స్కామ్ జరగలేదని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తప్పు జరిగిందని అంగీకరించే మంత్రి మోడీ మంత్రివర్గంలోనే లేదని అన్నారు. నీట్ స్కామ్‌పై సమగ్ర మిగతా 2లో

నీట్‌లో అక్రమాలు నిజమే

- తొలిసారి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఒప్పుకోలు



న్యూఢిల్లీ : నీట్ పరీక్షలో కొన్ని అక్రమాలు జరిగాయని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తొలిసారి అంగీకరించారు. ఆదివారం ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ రెండుచోట్ల అక్రమాలు జరిగినట్లు వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా తీసుకుంటుందని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)లో చాలా మెరుగుదల అవసరమని మంత్రి అంగీకరించారు. ఎన్‌టిఎలోని పెద్దలు ఎవరైనా దోషులుగా తేలినా వారిని విడిచిపెట్టబోమని చెప్పారు. ప్రభుత్వం ఈ విషయంపై తీవ్రంగా ఉందని, ఏ దోషినీ విడిచిపెట్టదని, దోషులకు కఠినశిక్ష పడుతుందని తెలిపారు. సుప్రీంకోర్టు సిఫార్సుల మేరకు 1,563 మంది అభ్యర్థులకు మరోసారి పరీక్ష నిర్వహించడం కోసం ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

'హోదా'పై అఖిలపక్షం

రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనే లక్ష్యంగా పనిచేయాలని, రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయటం లాంటి విభజన హామీల సాధనను ప్రాధాన్యతా అంశాల్లో చేర్చాలని రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యాన ఆదివారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడారు. ప్రత్యేక హోదా అనేది ఎన్నటికీ ముగిసిన అధ్యాయం కాదని, ఇది సజీవ సమస్యగా ఉందని అన్నారు. కేంద్ర మంత్రులు, ఎంపిలు కలిసి రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై చర్చించాలని కోరారు. అలాగే వైసిపి ఎంపిలు రాజ్యసభలో హోదాపై తీర్మానం చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఐక్యంగా పోరాడాలని, దానికి ప్రతిపక్షం కూడా సానుకూలంగా స్పందించాలన్నారు. పదేళ్లుగా రాష్ట్రానికి బిజెపి చేసిన అన్యాయాన్ని తెలుగు ప్రజలు మర్చిపోలేదని, ఇప్పటికీ గమనిస్తూనే ఉన్నారని అన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఎంపిలంతా బిజెపి అభ్యర్థులపైనే గెలుపొందారని గుర్తు చేశారు. టిడిపి ఎంపిలు లోక్‌సభలో, వైసిపి ఎంపిలు రాజ్యసభలో కీలకంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేందుకు ఇదే మంచి అవకాశమని అన్నారు. ప్రత్యేక హోదా సాధన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేసి ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. విశాఖ రైల్వేజోన్, రామాయపట్నం పోర్టు, కడప స్టీల్ ఫ్యాక్టరీని సాధించుకోవాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ..హోదా కోసం రాష్ట్రంలో 2014 నుండి పోరాటం జరుగుతోందన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు, జైభారత్ పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఏనుగు దాడిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రామకుప్పం (చిత్తూరు జిల్లా)

ఏనుగు దాడిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చిత్తూరు జిల్లా రామకుప్పం మండలంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, అధికారుల కథనం మేరకు.. పులిమడుగు తాండ గ్రామానికి చెందిన కన్నా నాయక్ (70) వ్యవసాయ కార్మికునిగా జీవనం సాగిస్తున్నారు. గ్రామం నుంచి కొత్తూరు తండాకు వెళ్లే దారిలో ఉన్న పశువుల షెడ్డు నుంచి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో ఏనుగు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూమార్తె ఉన్నారు. ఆదివారం ఉదయం కుప్పం డిఎస్‌పి శ్రీనాథ్, అటవీ శాఖ రేంజర్ జయశంకర్ తమ సిబ్బంది తో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జిల్లా డిఎఫ్‌ఒ చైతన్య కుమార్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ప్రభుత్వం అటవీ సరిహద్దుల్లో పంట పొలాలపై ఏనుగుల దాడులు అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పారిస్‌లో ఉద్యమిస్తున్న ప్రజానీకం

ఫాసిస్టు శక్తులపై పిడికిలెత్తిన ఫ్రెంచ్ ప్రజానీకం

పారిస్‌లో రెండున్నర లక్షలమందితో కవాతు

- దేశవ్యాపితంగా 182 చోట్ల ర్యాలీలు
- 6లక్షల మందికిపైగా హాజరు

ఏకతాటిపై నిలిచిన వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు, పౌర సమాజం

లోపలి పేజీలో..

ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన సిపిఎం
- వామపక్షాలు, 'ఇండియా' పార్టీలకు ఓటు వేసిన ప్రజలకు ధన్యవాదాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి నాయకత్వంలోని కూటమి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాటిలో ఐదు హామీలపై ముఖ్యమంత్రి తొలి సంతకాలు చేయడం పట్ల సిపిఎం స్వాగతించింది. ఎన్నికలకు ముందు ప్రజలకు టిడిపి-జనసేన ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరింది. ఈనెల 15న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు అధ్యక్షతన సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో ఎన్నికలు, ఎన్నికల ఫలితాలు, రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సమావేశానికి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఎంఎ బేబి హాజరయ్యారు. సిపిఎం రాష్ట్ర కమిటీ చర్చించి ఆమోదించిన ఈ కింది తీర్మానాన్ని పార్టీ రాష్ట్ర కమిటీ విడుదల చేసింది.

'తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని జనసేన, బిజెపి కూటమి భారీ మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాటిలో ఐదు హామీలపై ముఖ్యమంత్రి తొలి సంతకాలు చేసి అమలుకు సిద్ధపడడాన్ని సిపిఎం స్వాగతిస్తున్నది. టిడిపి ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరుతున్నది. ప్రత్యేకించి ఏజెన్సీలో జిఓ 3 పునరుద్ధరించి స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలని గిరిజన యువత ఎదురుచూస్తున్నది. స్మార్ట్‌మీటర్ల రద్దు చేస్తారని, ఉపాధి కల్పిస్తారని, ధరల భారాలను తగ్గిస్తారని, అదనపు భారాలు వేయబోరని, అవినీతి లేని పాలన అందిస్తుందని, సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని టిడిపి కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు ఆశతో వున్నారు. గత వైసిపి ప్రభుత్వ వైఫల్యాల నుండి నేర్చుకొని ప్రజానుకూల పాలన అందించడం ద్వారా ప్రజల ఆశలు నెరవేర్చాలని సిపిఎం కోరుతున్నది.

బిజెపి నాయకత్వంలోని కేంద్ర ఎన్‌డిఎ ప్రభుత్వం విభజన చట్టం హామీలు అమలు చేయకుండా గత పదేళ్లు కాలయాపన చేసింది. ప్రత్యేక హోదాను తిరస్కరించి ద్రోహం చేసింది. ప్రస్తుతం ఎన్‌డిఎలో టిడిపి, జనసేన పార్టీలు చేరడంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వంలో బిజెపి భాగస్వామిగా వుంది. ఇప్పటికైనా అమరావతిలో



సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎ బేబి, ఫొటోలో బివి.రాఘవులు, వి.శ్రీనివాసరావు, వై.వెంకటేశ్వరరావు

రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితుల పూర్తిస్థాయి పరిహారం, పునరావాసానికి అవసరమైన నిధులు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కడప ఉక్కు పరిశ్రమ లాంటి హామీల అమలు కోసం ఈ ప్రభుత్వం కృషి చేయాలని కోరుతున్నాం. విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలి. అన్ని పార్టీలనూ కలుపుకుపోయి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిలబెట్టాలని కోరుతున్నాం. రాజధాని సమస్యకు శాశ్వత పరిష్కారంగా అమరావతిపై ప్రత్యేక చట్టం చేసే అంశాన్ని పరిశీలించాలని కోరుతున్నాం. రాష్ట్ర హక్కుల కోసం లౌకికవాద రాజ్యాంగ సంస్థల పరిరక్షణ కోసం టిడిపి నిలబడుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

గత ఐదేళ్ల పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేదు సరికదా జనంపై విపరీతమైన భారాలు మోపింది. అవినీతిలో కూరుకుపోయింది. కింది స్థాయిలో ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ప్రకృతి వనరులను, ప్రజల ఆస్తులను దోచుకోవడానికి అరాచకాలకు పాల్పడ్డారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు లాంటి దుర్మార్గమైన చట్టాలు ప్రజలపై రుద్దింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, నిరుద్యోగులు, వివిధ తరగతుల వారి నిరసనలను, ప్రజా ఉద్యమాలను నిరంకుశంగా అణచివేసే చర్యలకు పాల్పడింది. కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన అన్ని వినాశకర బిల్లులనూ బలపరచింది. వీటన్నింటి వల్ల తీవ్ర అసంతృప్తితో ప్రజలు ఎన్నికల్లో వైసిపిని దారుణంగా ఓడించారు. ఓటమికి కారణాలపై ఆత్మవిమర్శ చేసుకోకుండా ప్రజలపై అసంతృప్తి వ్యక్తం చేయడం సరికాదు. ఇప్పటికీ కేంద్ర ఎన్‌డిఎ ప్రభుత్వం పట్ల సానుకూల వైఖరినే ఆ పార్టీ నేతలు ప్రకటిస్తున్నారు. బిజెపి పట్ల వైసిపి సానుకూల వైఖరిని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. కేంద్రంతో రాజీపడే వైఖరిని ఇప్పటికైనా విడనాడి లౌకికతత్వ పక్షాన నిలబడాలని కోరుతున్నాం. కేంద్రంలో మతోన్మాద బిజెపి తీవ్రమైన ఎదురుదెబ్బ తగిలింది. మోడీ నాయకత్వంలో మూడోసారి ఎన్‌డిఎ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. గత రెండు ఎన్నికలకు భిన్నంగా ఈసారి బిజెపి సొంత మెజారిటీ తెచ్చుకోలేకపోయింది. ప్రజలు బిజెపి విధానాలను, పద్ధతులను తిరస్కరించారు. తెలుగుదేశం, జెడియు తదితర మిత్ర పక్షాలపై ఆధారపడి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. గత పదేళ్లలో రైతు, కార్మిక, ప్రజా ఉద్యమాలను, ప్రశ్నించే గొంతులను అణచివేయడం, రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేసి దేశంపై నిరంకుశత్వాన్ని రుద్దింది. కార్పొరేట్లకు దేశాన్ని దోచిపెట్టింది. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ఎన్నికల్లో గెలవాలనుకున్న బిజెపి ఆశలు విఫలమయ్యాయి. బిజెపి నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడటానికి తెలుగుదేశం తోడ్పడింది. బలహీనపడ్డ బిజెపికి ఊపిరిపోసింది. కేంద్రంలో ఒక ముఖ్య పాత్ర పోషించనున్న టిడిపిపై కేంద్రంలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన విద్యుక్త ధర్మం వుంది. ఈ బాధ్యతను నెరవేర్చటానికి కేంద్రంపై టిడిపి ఒత్తిడి తేవాలని కోరుతున్నాం.

రాష్ట్రంలో బిజెపి ప్రమాదం గతం కంటే పెరిగింది. కేంద్రంలో అధికారంలో వుండడంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామి కావడం ద్వారా దాని మతతత్వ రాజకీయాలను విస్తరించుకోవడానికి భూమిక ఏర్పడింది. లౌకికవాదాన్ని బలహీనం చేయడానికి, రిజర్వేషన్లు రద్దు చేయడానికి అది ప్రయత్నిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో టిడిపి, బిజెపిలు భాగస్వాములుగా ఉన్న స్థితిలో రాష్ట్రంలో మతసామరస్యాన్ని కాపాడటానికి, రాజ్యాంగ వ్యవస్థలను ప్రత్యేకించి లౌకికవాదాన్ని, రిజర్వేషన్లను రక్షించేందుకు, మైనార్టీలకు రక్షణ కల్పించేందుకు టిడిపి గట్టి సంకల్పంతో వ్యవహరించాలని కోరుతున్నాం. మత ఉద్రిక్తతలు, ఘర్షణలు పెంచే ఎలాంటి ప్రయత్నాలనూ సహించకుండా రాష్ట్రంలో సామరస్య వాతావరణాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

గత ప్రభుత్వ హయాంలో న్యాయమైన తమ కోర్కెల సాధన కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ, స్కీం వర్కర్స్, మున్సిపల్, ఆర్‌టిసి కార్మికులు, రైతు, వ్యవసాయ కార్మిక, మహిళా, సామాజిక తరగతులు అనేక ఉద్యమాలు చేపట్టారు. ఉద్యమించిన వివిధ ప్రజా సంఘాల, ప్రతిపక్షాల కార్యకర్తలపై నిర్బంధంతోపాటు అక్రమ కేసులు బనాయించింది. ఇలాంటి నిరంకుశ పోకడలకు ఈ ప్రభుత్వం స్వస్తి చెప్పి అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి. ప్రజా సమస్యలపై సంబంధిత సంఘాలతో చర్చించి సామరస్యంగా పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేస్తున్నది.

ఈ ఎన్నికల్లో రెండు బలమైన శిబిరాల మధ్య జరిగిన హోరాహోరీ పోరులో వామపక్షాలు, సిపిఎం, ఇండియా బ్లాక్ పార్టీలు ఎదురీదాయి. అయినప్పటికీ ఏజెన్సీ ప్రాంతంలో అరకు పార్లమెంటు, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో బిజెపికి వ్యతిరేకంగా, ఆదివాసీ సమస్యలపై సిపిఎం చేసిన కృషి ఫలితంగా గతంకన్నా ఎక్కువ ఓట్లు వేసి ఆదరించారు. వారికి సిపిఎం రాష్ట్ర కమిటీ ధన్యవాదాలు తెలియజేస్తున్నది. రాష్ట్రంలో సిపిఎం, వామపక్షాలు, ఇండియా బ్లాక్ పార్టీలకు ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతోంది.

రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే ప్రజానుకూల నిర్ణయాలను సిపిఎం బలపరుస్తుంది. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలని ఒత్తిడి చేస్తుంది. మన రాష్ట్ర హక్కుల కోసం కేంద్రంపై పోరాడేందుకు మద్దతు ఇస్తుంది. ప్రజల తరపున, శ్రామిక ప్రజలపక్షాన గతంలో వలె నికరంగా నిలబడి పోరాడుతుందని రాష్ట్ర ప్రజలకు హామీ ఇస్తున్నాం. బిజెపి మతోన్మాదానికి, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు, లౌకిక ప్రజాతంత్ర వాదులతో కలిసి సిపిఎం కృషి చేస్తుంది. ప్రత్యేక హోదా సాధన, విభజన హామీల అమలుకోసం రాష్ట్ర ప్రజలను, ప్రజా సంఘాలను కలుపుకుని ఐక్య ఉద్యమాలను నిర్మించేందుకు పనిచేస్తుంది. సామాజిక న్యాయం, సంక్షేమం, లౌకికతత్వం, రాష్ట్రాభివృద్ధి కోసం కృషిని కొనసాగిస్తుంది. ఈ ప్రయత్నాలకు ప్రజలు అండదండలివ్వాలని సిపిఎం రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేస్తున్నది.'

కేన్సర్ రహిత రాష్ట్రం దిశగా అడుగులు

- వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేన్సర్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేలా అన్ని రకాల చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో ఆయనకు కేటాయించిన ఛాంబర్‌లో ఆదివారం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్యాశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాస్పత్రుల్లో ఎయిమ్స్ తరహాలో మెరుగైన వైద్యసేవలు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అందుకు అవసరమైన మౌలిక వసతులను మెరుగు పరచడంతోపాటు సిబ్బందిని కూడా సమకూర్చేలా చర్యలు చేపడతామన్నారు. ప్రతి ఏడాది సగటున 48 వేలమంది కేన్సర్ మహమ్మారి బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్ల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు వ్యాధిని ముందుగానే గుర్తించి వైద్యసేవలు అందజేయాలనే లక్ష్యంతో దాదాపు 5.30 కోట్ల మందికి స్క్రీనింగ్ చేసేందుకు నిర్ణయం తీసుకుంటూ తొలి సంతకం చేశానన్నారు. ఇందుకోసం ఇంటింటి సర్వే నిర్వహించేందుకు అవసరమైన శిక్షణ హోమిబాబా కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో యువత పెద్దయెత్తున గంజాయి, డ్రగ్స్ వినియోగిస్తూ వాటికి బానిసలు అవుతున్నట్లుగా వార్తలు వస్తున్నాయని, అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా డ్రగ్స్‌కు బానిసలైన యువతలో మార్పు తెచ్చేందుకు డి-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వం అత్యంత ప్రధానమైన ఆరోగ్య రంగాన్ని ఎంతో నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు ఎస్ వెంకటేశ్వర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పద్మావతి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరసింహం, ఆరోగ్య విశ్వవిద్యాలయం విసి బాబ్జీ, రిజిస్ట్రారు రాధికారెడ్డి పాల్గొన్నారు.

హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీగా పోలా భాస్కర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీగా కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనరు పోలా భాస్కర్‌కు పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వం జిఓ ఆర్‌టి నెంబరు 1077ను ఆదివారం విడుదల చేసింది. ఇప్పటి వరకు ఈ పోస్టులో పనిచేస్తున్న జె శ్యామలరావును ప్రభుత్వం టిటిడి ఇఒగా నియమించిన విషయం తెలిసిందే.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

అధికారులతో విచారణ

(మొదటిపేజీ తరువాయి)

విచారణ అవసరమని చెప్పారు. సిబిఐ విచారణ ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వాన్ని రక్షిస్తుందని, కాబట్టి స్వతంత్ర సంస్థ లేదా సుప్రీంకోర్టు నియమించిన అధికారుల ద్వారా విచారణ అవసరమని అన్నారు. 140 కోట్ల జనాభా, సంక్లిష్టమైన సామాజిక వ్యవస్థ ఉన్న దేశంలో మోడీ ప్రభుత్వం ప్రతి విషయాన్నీ కేంద్రీకృతం చేస్తుందని విమర్శించారు. మెడిసిన్ ప్రవేశాలు ఎలా ఉండాలనే అంశంపై కేంద్రం ప్రతి రాష్ట్రాన్నీ సంప్రదించి ఏకాభిప్రాయంతో ముందుకెళ్లాలని సిబాల్ కోరారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

- ప్రజా వైద్యులు జెట్టి శేషారెడ్డి స్మారక సదస్సులో జస్టిస్ టి రజిని

ప్రజాశక్తి- నెల్లూరు




మాట్లాడుతున్న విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి టి రజని

రాజ్యాంగాన్ని ప్రజలు పరిరక్షించుకోవాలని విశ్రాంత ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి రజని పేర్కొన్నారు. పౌరుల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు సంబంధించి రాజ్యాంగ పీఠికలో రాసుకున్న హక్కులకు, విలువలకు ఎంతో ప్రాధాన్యత ఉందని అన్నారు. ప్రజా వైద్యులు జెట్టి శేషారెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా ఆదివారం డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో 'రాజ్యాంగ విలువలు - సవాళ్లు, ఆరోగ్య హక్కు చట్టం-2024 అనే అంశాలపై 16వ స్మారక సదస్సు జరిగింది. డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం, డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల, యుటిఎఫ్, జన విజ్ఞాన వేదిక, మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్, ప్రజారోగ్య వేదిక, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యవక్తగా విచ్చేసిన జస్టిస్ రజని మాట్లాడుతూ రాజ్యాంగం ఎంత మంచిదైనప్పటికీ దీనిని అమలుపరిచేవారు మంచివారైతే మంచిగానూ, లేదంటే భిన్నంగానూ ఫలితాలు వస్తాయన్నారు. రాజ్యాంగ హక్కులను సుప్రీంకోర్టు విస్తృతపరిచిందని వివరించారు. అందరికీ కూడు, గుడ్డ, ఆరోగ్యం, విద్య, మంచి పరిసరాలు అందించాల్సి అవసరం ఎంతైనా ఉందన్నారు. అన్ని మతాలనూ గౌరవించే లౌకిక రాజ్యాంగం మనదని తెలిపారు. రాజ్యాంగ మౌలిక స్వరూపం మార్చకూడదన్నారు. ఆరోగ్య హక్కు చట్టం-ఆంధ్రప్రదేశ్ 2024 అనే అంశంపై ప్రపంచ ఆరోగ్య ఉద్యమ సమన్వయకర్త డాక్టర్ సుందర్ రామన్ మాట్లాడుతూ ఆరోగ్యం అనేది ప్రతి పౌరుని ప్రాథమిక హక్కని తెలిపారు. ఆరోగ్యమన్నది పూర్తిగా రాష్ట్ర పరిధిలోనే ఉండాలన్నారు. ఆరోగ్యాన్ని ఆదేశిక సూత్రాల నుంచి ప్రాథమిక హక్కుల్లోకి మార్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 1978లో రష్యాలోని అల్మాఆట డిక్లరేషన్ ప్రకారం 2000 సంవత్సరం నాటికి ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం అందాలన్నారు. ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజారోగ్య సంరక్షణలో డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ జెట్టి శేషారెడ్డి సేవలు వెలకట్టలేనివన్నారు. ఈ సదస్సుకు డాక్టర్ రామచంద్రారెడ్డి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేశ్వరరావు అధ్యక్షత వహించారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎంవి.రమణయ్య, జెఎస్ ట్రస్ట్ చైర్మన్ చంద్ర రాజగోపాల్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్, జిల్లా అధ్యక్షులు ఉదయ భాస్కర్, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం, డాక్టర్ సూరా రవీంద్ర, ఐలు నాయకులు అంకయ్య, మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు పి.మధు, మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిపిసిఆర్ రక్షించిన 39 మంది బాలకార్మికులు అదృశ్యం

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని ఒక డిస్టిలరీ నుంచి నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సిపిసిఆర్) రక్షించిన మొత్తం 58 మంది బాలకార్మికుల్లో 39 మంది అదృశ్యం కావడం సంచలనంగా మారింది. ఇందుకు బాధ్యులైన అధికారులపై కఠినచర్యలు తీసుకోవాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఎన్‌సిపిసిఆర్ కోరింది. మధ్యప్రదేశ్‌లోని రాయ్‌సేన్ జిల్లాలో ఓ మద్యం పరిశ్రమలో బాల కార్మికుల పనిచేస్తున్నారనే ఫిర్యాదుతో ఎన్‌సిపిసిఆర్ అక్కడ దాడులు చేసి, 58 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించారు. ఈ విషయాన్ని కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులకు తెలిపింది. అక్కడకు విచారణ కోసం సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్‌డిఎం), చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వచ్చేసరికి రక్షించిన పిల్లల్లో 39 మంది పిల్లలు అదృశమయ్యారు. దీంతో జాతీయ కమిషన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరింది. 20 కిలోమీటర్లు దూరంలో ఉన్న సంఘటనా స్థలానికి చేరుకోవడానికి ఎస్‌డిఎంకు 5 గంటల సమయం పట్టిందని విమర్శించింది. కమిషన్ రక్షించిన 58 మందిలో 39 మంది బాలురు, 19 మంది బాలికలు ఉన్నారు. "ఆ పిల్లల పరిస్థితి దారుణంగా ఉంది. వారితో రోజుకు 12-14 గంటలు పనిచేయిస్తున్నారు. పరిశ్రమలోని రసాయనాలు, ఆల్కహాల్ గాఢత కారణంగా వారి చేతులకు కాలిన గాయాలయ్యాయి. కొందరి చర్మం ఒలిచినట్లు తయారైంది. అక్కడ రసాయనాల ఘాటును భరించలేం. ఇటువంటి



డిస్టలరీలో పనిచేస్తున్న బాలల చేతులు కాలిన దృశ్యం

దుర్భర పరిస్థితుల్లో పిల్లలతో పనిచేయిస్తున్నారనేది ఊహించలేం. ఈ వ్యవహారం మానవ అక్రమ రవాణాతోనూ ముడిపడి ఉంది. కొంతమంది స్థానిక అధికారులు ఈ దారుణాలకు సహకరించినట్లు తెలుస్తోంది" అని ఎన్‌పిసిఆర్‌సి చైర్మన్ ప్రియాంక్ కనుంగూ తెలిపారు. ఎవరికీ అనుమానం రాకుండా చిన్నారులను ఓ స్కూల్ బస్సులో పని ప్రదేశానికి తరలిస్తున్నారని చెప్పారు.

రుషికొండలో వున్నవి ప్రభుత్వ భవనాలే : వైసిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖలోని రుషికొండలో ఉన్నవి ప్రభుత్వ భవనాలని, అవి ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులు తప్ప ప్రైవేట్ ఆస్తులు కావని, ఆ భవనాల పేరుతో టిడిపి దుష్ప్రచారం చేయడం తగదని వైసిపి పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ ఆదివారం ట్వీట్ చేసింది. విశాఖపట్నానికి గత ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఈ భవనాలను నిర్మించిందని, వాటిని ఎలా వినియోగించుకోవాలన్నది ప్రభుత్వం ఇష్టమని పేర్కొంది. అలాంటి ప్రభుత్వ భవనాల్లోకి వెళ్లి ఫొటోలు తీయించి, వాటికి వక్రీకరణలు జోడించి బురద జల్లాలని ప్రయత్నించడం వెనుక ఉద్దేశాలేంటో ప్రజలు గమనిస్తున్నారని తెలిపింది. 1995 నుంచి విశాఖపట్నం ఆర్థిక రాజధాని అని చంద్రబాబు ఊదరగొడుతూనే ఉన్నారని, నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయినా విశాఖపై దృష్టి సారించలేదని పేర్కొంది. విశాఖ నగరానికి ఒక ప్రధాన మంత్రి, రాష్ట్రపతి వచ్చినా, ముఖ్యమంత్రి వెళ్లినా, గవర్నర్ లాంటి వ్యక్తులు వెళ్లినా వారికి ఆతిథ్యం ఇవ్వడానికి సరైన భవనమే లేదన్న విషయాన్ని గుర్తించుకోవాలని పేర్కొంది.

జోగి రమేష్ ఇంటిపై దాడి తగదు

ఇబ్రహీంపట్నం ఫెర్రీ రోడ్డులోని మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై టిడిపి, జనసేనకు చెందిన అల్లరి మూకలు దాడులు చేయడం తగదని వైసిపి ఒక ప్రకటనలో పేర్కొంది. జోగి రమేష్ ఇంటి ముందే కారు ఆపి తెచ్చుకున్న రాళ్లను ఇంటిపైకి విసిరారని తెలిపింది. రాళ్ల దాడిని అడ్డుకున్న కానిస్టేబుల్‌ను కూడా గాయపరిచారని పేర్కొంది. అలాగే విజయవాడలో 20 ఏళ్లుగా వ్యాపారాలు చేసుకుంటున్న వారిపై టౌన్ ప్లానింగ్ అధికారులు బెదిరింపులకు పాల్పడటం తగదని పేర్కొంది. అర్ధరాత్రి దుకాణాలు తొలగించడం అన్యాయమని తెలిపింది.

స్టీల్‌ప్లాంట్‌పై దృష్టి సారించండి


- ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి పోరాట కమిటీ నాయకుల మనవి



ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు రాష్ట్ర సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ త్వరితగతిన కేంద్రంలోని సంకీర్ణ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలో పోరాట కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 1221వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఎఐటియుసి కాంట్రాక్ట్ కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు, విళ్లా రామ్మోహన్ కుమార్, కామేశ్వరరావు మాట్లాడుతూ గత మూడున్నర సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ గోడు వినిపించుకోలేదని అన్నారు. లాభాల్లో ఉన్న కంపెనీని ప్రయివేటీకరించేందుకు కేంద్రం కుట్ర పన్నితే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వత్తాసు పలికి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో రూ.4000 కోట్ల నష్టాల వైపునకు నెట్టబడిందని ఆవేదన వ్యక్తంచేశారు. గత ఆరు నెలలుగా జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితికి దిగజార్చారన్నారు. జగన్ తీరును ప్రజలు వ్యతిరేకించి, టిడిపి, జనసేన కూటమికి భారీ మెజారిటీ కట్టబెట్టిన ప్రజల ఆకాంక్ష పట్ల కాలయాపన చేయకుండా కేంద్రంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని కోరారు.

సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తిస్థాయి సామర్థ్యంతో ఉత్పత్తి తీయాలని, వర్కింగ్ క్యాపిటల్‌కు కావాల్సిన ఆర్థిక వెసులుబాటు కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న భూములు స్టీల్‌ప్లాంటుకు బదలాయించాలని, ఇతర స్టీల్ ప్లాంట్ల మాదిరిగా ఇక్కడ కూడా నూతన వేతనాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల వేతనాలు ఇంత వరకు ఇవ్వలేదని, సకాలంలో వేతనాలు చెల్లించే విధంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు సన్యాసిరావు, దాసరి శ్రీనివాస్, శ్రీనివాస్‌నాయుడు, మహాలక్ష్మినాయుడు, డేవిడ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి డి.బాలవీరాంజనేయస్వామి

ప్రస్తుతం పనిచేస్తున్న వలంటీర్లను కొనసాగిస్తాం

- ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ : మంత్రి డి.బాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి- టంగుటూరు (ప్రకాశం జిల్లా)

ప్రస్తుతం పనిచేస్తున్న వలంటీర్లను కొనసాగిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, సచివాలయాలు, వలంటీర్ల శాఖ మంత్రి డి.బాలవీరాంజనేయస్వామి తెలిపారు. వైసిపి నేతలు తమతో బలవంతంగా రాజీనామాలు చేయించారని, మా జీవితాలతో ఆడుకున్నారని వలంటీర్లు తన ఫోన్‌కు వాట్సప్ మెసేజ్‌లు పంపించారని, ఇలాంటి మెసేజ్‌లతో తన వాట్సప్ అంతా నిండిపోయిందని చెప్పారు. మంత్రి హోదాలో తొలిసారి జిల్లాకు వచ్చిన ఆయన తన నియోజకవర్గ పరిధిలోని ప్రకాశం జిల్లా టంగుటూరు మండల పరిధిలోని వల్లూరమ్మ తల్లి దేవాలయములో ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వలంటీర్లతో ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పారు. వచ్చే ఒకటో తేదీన పింఛనుదారులకు రూ.7 వేలను వారి ఇంటి వద్దే అందిస్తామన్నారు. అభివృద్ధికి, సంక్షేమానికి తమ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై త్వరలో శ్వేత పత్రం విడుదల చేస్తామన్నారు. త్వరలో పలు కీలక బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెడతామని మంత్రి తెలిపారు.

త్యాగనిరతిని వ్యాపింపజేయడమే బక్రీద్

- గవర్నరు, సిఎం చంద్రబాబు, జగన్, లోకేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వార్థం, అసూయ, రాగద్వేషాలను విడిచిపెట్టి మానవుల్లో త్యాగనిరతిని వ్యాపింపజేయడమే బక్రీద్ పండగ ముఖ్య ఉద్దేశమని గవర్నరు అబ్దుల్ నజీర్, సిఎం నారా చంద్రబాబు నాయుడు, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఐటి మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం వారు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. అన్ని గుణాల కన్నా దాన గుణమే ఉత్తమమైనదని బక్రీద్ సారాంశమని, పండగ సందర్భంగా ఖుర్బాని ద్వారా పేదలకు ఆహారం వితరణగా ఇస్తారని అన్నారు. హజ్రత్ ఇబ్రహీం త్యాగనిరతిని స్మరించుకుంటూ బక్రీద్ పండగను జరుపుకుంటున్న ముస్లిం సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండగని స్ఫూర్తిగా తీసుకుని సమైఖ్యతను, సమానత్వాన్ని సాదిద్ధామన్నారు.

పాత ప్లాన్ ప్రకారమే అమరావతి

(మొదటిపేజీ తరువాయి)

స్వీకరించిన మంత్రి నారాయణను అమరావతి రైతులు కలిసి అభినందనలు తెలిపారు.

మూడు వారాల్లో అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ

నిరుపేదలు కేవలం రూ.5 చొప్పున ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం అందించే అన్న క్యాంటీన్లను మూడు వారాల్లో పునరుద్ధరిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం క్యాంటీన్ల పునరుద్ధరణపై మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సిఎంగా చంద్రబాబు తొలిసారిగా చేసిన ఐదు సంతకాల్లో అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ ఫైల్ కూడా ఉందన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో 203 క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినప్పటికీ 184 ప్రారంభించగా, మిగిలిన 19 క్యాంటీన్లు నిర్మాణ దశలో ఉండిపోయాయన్నారు. అన్న క్యాంటీన్లను పునరుద్ధరించేందుకు అవసరమైన మరమ్మతులు చేసేందుకు అంచనాలను రెండు, మూడు రోజుల్లో అందజేయాలని అధికారులను ఆదేశించారు. గతేడాది అన్న క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతను ఇస్కాన్ సంస్థకు అప్పగించామని, మూడు పూటలా ఆహారం అందజేసేందుకు రోజుకు రూ.73 ఛార్జి చేయడం జరిగిందన్నారు. రోజుకు కేవలం రూ.15లకే మూడు పూటలా ఆహారం అందజేస్తూ మిగిలిన రూ.58లను రాయితీగా ప్రభుత్వమే భరించిందన్నారు. రోజుకు 2.25 లక్షల మంది అన్న క్యాంటీన్ల ద్వారా భోజనం చేసే వారని, తమ హయాంలో మొత్తమ్మీద నాలుగు కోట్ల అరవై లక్షల 31 వేల 600 ప్లేట్ల భోజనాన్ని అన్న క్యాంటీన్ల ద్వారా పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సిఎస్ వై శ్రీలక్ష్మి, సిడిఎంఎ శ్రీధర్, సిఆర్‌డిఎ కమిషనరు వివేక్ యాదవ్, అదనపు కమిషనరు కట్టా సింహాచలం, విజయవాడ మున్సిపల్ కమిషనరు స్వప్నిల్ దినకర్, సిఆర్‌డిఎ చీఫ్ ఇంజినీర్ ఎన్‌విఆర్‌కె ప్రసాద్, సిహెచ్ ధనుంజయ్ పాల్గొన్నారు.

నట్టేట పోలవరం నిర్వాసితులు

(మొదటిపేజీ తరువాయి)

సేకరించిన భూములకు ఎకరాకు రూ.ఐదు లక్షలు పరిహారం ఇస్తామని 2019 ఎన్నికల్లో హామీలు ఇచ్చాయి. ఇవేవీ అమలుకు నోచుకోలేదు.

గోదావరికి జులై, ఆగస్టు నెలల్లో వరదలు వచ్చే అవకాశం ఉంది. ముందుగా నిర్వాసితులకు పరిహారం ఇచ్చి వారిని నిర్వాసిత కాలనీలకు తరలించాలి. లేకపోతే వరదలకు తలోదారి అన్నట్లు పరిస్థితి ఏర్పడనుంది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తమ తొలి ప్రాధాన్యతగా చెబుతోంది. ఈ దృష్ట్యా పోలవరం నిర్వాసితులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారంపై కటాఫ్ డేట్‌పైనా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కొంతమందికి ఇప్పటికీ భూమికి భూమి ఇవ్వలేదు. అలాంటి సమస్యలనూ పరిష్కరించాలి. నిర్వాసితులను త్యాగధనులుగా కీర్తిస్తున్న ప్రభుత్వాలు వారికి న్యాయం మాత్రం చేయడం లేదు. పోలవరం ప్రాజెక్టు సందర్శనకు సోమవారం వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు తమ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్వాసితులు కోరుతున్నారు.

19న పవన్‌కల్యాణ్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఈ నెల 19న ఈ నెల 19న పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖలను ఆయనకు కేటాయించిన సంగతి తెలిసిందే. పవన్‌కల్యాణ్‌కు డిప్యూటీ సిఎం ఇవ్వడం పట్ల పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పల్లా నియామకంపై టిడిపి ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి రాష్ట్ర అధ్యక్షులుగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు. విశాఖపట్నం పార్లమెంటు అధ్యక్షునిగా సమర్ధవంతంగా పనిచేసిన శ్రీనివాసరావు నూతన బాధ్యతలు విజయవంతంగా నిర్వహిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులుగా ఇప్పటివరకు పార్టీని నడిపించడంలో అద్భుత పనితీరు కనబరిచిన సీనియర్ నేత, రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు అభినందనలు తెలిపారు. ప్రతిపక్షంలో అనేక సమస్యలు, సవాళ్లను ఎదుర్కొని పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని అచ్చెన్నను చంద్రబాబు ప్రశంసించారు.

నేటి నుంచి కేంద్ర బృందాల పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రబీ కరువు పరిస్థితిని పరిశీలించి, అంచనా వేయడానికి రితేష్ చౌహాన్ నేతృత్వంలోని కేంద్ర బృందాలు కరువు ప్రభావిత జిల్లాల్లో ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు పర్యటించనున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పది మంది సభ్యులు మూడు బృందాలుగా క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి కరువు పరిస్థితిని విశ్లేషించనున్నారు. ఒకటో బృందం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రెండో బృందం, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో మూడో బృందం పర్యటించనున్నట్లు తెలిపారు.

ఫర్నీచర్ దొంగ జగన్

- మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫర్నీచర్ దొంగ అని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. జగన్ ఇంట్లో ఉన్న ప్రభుత్వ ఫర్నీచర్‌ను వాడుకుంటూ వైసిపి నేతలు నీతులు చెప్పడం సిగ్గుచేటని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఫర్నీచర్ విషయంలో మాజీ స్పీకరు కోడెల శివప్రసాద్‌పై అసత్య ఆరోపణలు చేసిన వైసిపి నేతలు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కోడెల తప్పు చేసి చనిపోలేదని, వైసిపి నేతల వేధింపులకు గురై చనిపోయారని అన్నారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉన్న కుటుంబంపై లేని మరకలు మోపారని పేర్కొన్నారు. తన ఇంటి నుంచి ఫర్నీచర్ తీసుకెళ్లాలని అప్పటి స్పీకర్‌కు రెండు సార్లు కోడెల లేఖలు రాసినా పట్టించుకోకుండా తప్పుడు కేసులు పెట్టడం కక్షసాధింపు చర్యలకు నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు.

తాడేపల్లి, లోటస్‌పాండ్ ఇళ్లకు రూ.50 కోట్లు సిఎంఒ ఖాతాలో తీసుకొచ్చి ఫర్నీచర్, ఇతర వసతులను జగన్ అమర్చుకున్నారని ఆరోపించారు. ఆ ఫర్నీచర్‌ను తిరిగి అప్పగిస్తానని జగన్ ఇప్పటివరకు ప్రభుత్వానికి ఒక్క లేఖ కూడా రాయలేదని విమర్శించారు.

మెస్ ఛార్జీలు పెంచాలి

- ఉపాధ్యాయ, అధ్యాపక ఖాళీల భర్తీకి ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్
- ముగిసిన రాష్ట్ర ప్లీనరీ



రాష్ట్ర ప్లీనరీ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న వై వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, ఆమదాలవలస

పెరిగిన ధరలకనుగుణంగా సంక్షేమ వసతిగృహాల్లో మెస్ ఛార్జీలు పెంచాలని, ఉపాధ్యాయ, అధ్యాపక ఖాళీలను భర్తీ చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర ప్లీనరీ డిమాండ్ చేసింది. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. శ్రీకాకుళం రూరల్ మండలం చింతాడలోని జిఎల్ ఫంక్షన్ హాలులో రెండ్రోజులుగా నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత పూర్వ అధ్యక్షులు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం నూతన విద్యావిధానాన్ని అమలు చేసే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రమూ అమలు చేయకపోయినా, గత వైసిపి ప్రభుత్వం మన రాష్ట్రంలో నూతన విద్యా విధానం అమలు చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన టిడిపి ప్రభుత్వం నూతన విద్యావిధానం అమల్లో ఎటువంటి వైఖరి తీసుకోనుందో వేచిచూడాల్సి ఉందన్నారు. విద్యారంగానికి సంబంధించి 77, 117 జిఒల రద్దు, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్యా పథకం వంటి హామీలను ఇచ్చిందని, వాటిని నెరవేర్చాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వంపై ఉందని వివరించారు. పాఠశాలలు తెరిచిన నేపథ్యంలో పాఠ్య పుస్తకాలు, హాస్టల్ సమస్యలపై వినతుల రూపంలో ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. సమస్య తీవ్రతను బట్టి ఆందోళనల రూపంలో విద్యార్థులకు అండగా నిలవాలని సూచించారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ సంకీర్ణ ప్రభుత్వంలో బిజెపి ఉన్నందున, ఎబివిపి విద్యార్థుల్లోనూ విభజన తీసుకొచ్చి వారి ఐక్యతను దెబ్బతీసే ప్రమాదముందని హెచ్చరించారు. రిజర్వేషన్ల ఎత్తివేత, రాజ్యాంగం మార్పు వంటి చర్యలకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నించవచ్చన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీనపరిచే నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, అర్హులందరికీ అమ్మఒడి పథకం వర్తింపుతో పాటు జిఒ నంబర్లు 77, 117 రద్దు చేయాలని, డిగ్రీ విద్యలో ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేయాలనే తీర్మానాలను ప్లీనరీ ఆమోదించింది. విద్యాసంస్థలు, వసతిగృహాల్లో అమ్మాయిలకు ఉచితంగా శానిటరీ నాప్‌కిన్స్ అందించాలని కోరారు. కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల భర్తీతో పాటు ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందించాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి చందు, బి హరీష్, రాష్ట్ర నాయకులు వినోద్, రామ్మోహన్, వెంకటేష్, ఎల్‌జి నాయుడు, పావని పాల్గొన్నారు.


రుషికొండపై నిర్మించిన భవనం


రుషికొండపై నిర్మించిన భవనం లోపలి దృశ్యం

'రుషికొండ' నిర్మాణాలపై
త్వరలో నిర్ణయం : ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

విశాఖ రుషికొండపై నిర్మాణాలు పూర్తిగా వ్యక్తిగతంగా ఉన్నాయని, వీటిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రుషికొండపై కట్టిన భవన నిర్మాణాలను కూటమి నాయకులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా మీడియాతో మాట్లాడుతూ ఏడు బ్లాకులుగా చేపట్టిన ఈ నిర్మాణాలలో మూడు బ్లాకుల్లో జగన్‌మోహన్ రెడ్డి అత్యంత విలాసవంతమైన గృహ సముదాయాన్ని నిర్మించుకోగా మిగిలిన నాలుగు బ్లాకుల్లో ఒకటి సిఎంఒ కార్యాలయానికి, ఒకటి ప్రధాన అధికారుల ఛాంబర్లకు, మిగిలిన రెండు బ్లాకులు సాధారణ అధికారుల కార్యాలయాలకు ఉండే విధంగా సుమారు రూ.500 కోట్ల వ్యయంతో నిర్మించారని తెలిపారు. ఈ నిర్మాణాలు పూర్తి సెంట్రల్ ఎసి కలిగి పూర్తి గ్రానైటెడ్ ఫినిషింగ్‌తో అత్యాధునిక ఎలక్ట్రిక్ టెక్నాలజీ, భారీ స్క్రీన్లు, విలాసవంతమైన బెడ్రూంలు, బాత్రూంలు కలిగి ఉన్నాయన్నారు. ఈ కట్టడాల గురించి తెలుసుకుందామని గతంలో వస్తే వైసిపి ప్రభుత్వం ఎన్నో అక్రమ కేసులు పెట్టిందని తెలిపారు. చంద్రబాబు, పవన్‌ను సైతం ఇక్కడికి రాకుండా అడ్డుకున్నారని చెప్పారు. పచ్చటి టూరిజం రిసార్ట్‌ను అన్యాయంగా కూల్చివేసి, విలాసవంతంగా కట్టడాలను కట్టారన్నారు. కొంతకాలం టూరిజం రిసార్ట్ అని, మరికొంతకాలం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయమని చెబుతూ వచ్చారని తెలిపారు. రుషికొండ నిర్మాణం ప్రారంభం కూడా అత్యంత రహస్యంగా ఆనాటి పర్యాటక మంత్రి రోజా చేశారన్నారు. ఈ నిర్మాణాలపై కోర్టులు వేసిన కమిటీ ఇక్కడ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయంటూ నివేదిక ఇచ్చాయని వివరించారు. త్వరలోనే విశాఖలో సిఎం చంద్రబాబు పర్యటన ఉంటుందని, ఈ భవనాన్ని ఏం చేయాలో ఆయనతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు పంచకర్ల సందీప్, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నంలోని మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై రాళ్లతో దాడి చేస్తున్న దుండగులు

మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై రాళ్ల దాడి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై రాళ్ల దాడి జరిగింది. ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం ఫెర్రీ రోడ్డులోని జోగి రమేష్ ఇంటిపై కొందరు యువకులు రాళ్లు రువ్వారు. ఎపి 39 కెడి 3267 కారులో వచ్చిన నలుగురు దుండగులు జోగి ఇంటి ముందే కారు ఆపి తమతో తెచ్చుకున్న రాళ్లను విసిరారు. వారిని అడ్డుకునే ప్రయత్నం చేసిన పోలీసు కానిస్టేబుల్ పట్ల దురుసుగా ప్రవర్తించారు. కానిస్టేబుల్ ప్రతిఘటించడంతో వారు వచ్చిన కారులో వెళ్లిపోయారు. దాడి సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. దాడి చేసిన వారికోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దాడి విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు జోగి రమేష్ ఇంటికి వచ్చారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జోగి రమేష్ ఇంటిపై టిడిపి నేతలు దాడికి దిగుతారని నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆయన ఇంటి వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆయన ఇంటి చుట్టూ ముళ్ల కంచెను ఏర్పాటు చేశారు. అయినా దుండగులు దాడికి పాల్పడ్డారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి
ఐక్య పోరాటాలే మార్గం

- సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు


సదస్సులో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతాంగ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గమని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. ఏలూరులోని టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో జరుగుతున్న రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభలో భాగంగా రెండో రోజు ఆదివారం 'వ్యవసాయ రంగ సంక్షోభం - పాలకుల విధానాలు - మన కర్తవ్యాలు'పై అనే అంశంపై సదస్సు నిర్వహించారు. తొలుత ప్రజాకవి సుంకర రచించిన అల్లూరి సీతారామరాజు 'బుర్రకథ'ను ప్రజా కళాకారుల బాలికా బృందం ప్రదర్శించింది. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ అధ్యక్షతన జరిగిన సదస్సులో వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడారు. గత పదేళ్లలో రైతుల ఆదాయం రెట్టింపు చేసే హామీని ఎగ్గొట్టిన మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు మాత్రం రూ.25 లక్షల కోట్ల రుణాలను రద్దు చేసిందన్నారు. మరోపక్క కనీస మద్దతు ధరను చెల్లించకుండా రైతాంగాన్ని రూ.లక్షల కోట్ల నష్టాలకు గురిచేసిందని, దీనికి నిరసనగానే గడిచిన లోక్‌సభ ఎన్నికల్లో అధికారంలో నుంచి తప్పుకోమని ప్రజలు మోడీ ప్రభుత్వానికి సీట్లు తగ్గించారన్నారు. భారతదేశం మొత్తంగా 19 కోట్ల రైతు కుటుంబాలకు, కుటీర పరిశ్రమలకు ఇచ్చిన రుణాల కన్నా కేవలం 20 కార్పొరేట్ సంస్థలకు ఇచ్చిన రుణాలే ఎక్కువని వివరించారు. ప్రభుత్వాల పంటల బీమా పథకాలు రైతుల కంటే ఇన్సూరెన్స్ కంపెనీలకే ఎక్కువ మేలు చేస్తున్నాయని తెలిపారు. వ్యవసాయానికి సాగునీటిని కల్పించడంలో పాలకులు తీవ్ర నిర్లక్ష్యంగా ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న రైతు, ప్రజా వ్యతిరేక విదానాలపై ఐక్యంగా పోరాడాలని కోరారు. నల్లమడ రైతాంగ సమితి నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్ 'భారత రైతాంగ ఉద్యమం-కనీస మద్దతు ధర' అనే అంశంపై మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ ప్రధానంగా భూసంస్కరణలు జరగాలని, రైతాంగానికి కనీస మద్దతు ధరలు దక్కాలని చెప్పిందని గుర్తు చేశారు. అయితే, నేటికీ ప్రభుత్వాలు వాటిని అమలు చేయడానికి పూనుకోవట్లేదన్నారు. సదస్సులో వ్యవసాయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కెవివి.ప్రసాద్ సందేశాలిచ్చారు.

జగన్ ఇంటి నిర్మాణాల కూల్చివేతపై
తెలంగాణ ప్రభుత్వం సీరియస్

- ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌పై బదిలీ వేటు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ లోటస్ పాండ్‌లోని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి ముందు అక్రమ నిర్మాణాల కూల్చివేతపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా నిర్మాణాలు, షెడ్ల కూల్చివేతకు ఆదేశాలు జారీ చేసిన జిహెచ్‌ఎంసి ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ బోర్ఖడే హేమంత్‌ను బదిలీ చేసింది.

సాధారణ పరిపాలన విభాగానికి అటాచ్ చేస్తూ జిహెచ్‌ఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ ఆమ్రపాలి ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. లోటస్‌పాండ్‌లోని జగన్ ఇంటి ముందు ఫుట్‌పాత్‌పై సెక్యూరిటీ కోసం గతంలో షెడ్లు నిర్మించారు. రహదారిని ఆక్రమించి చేపట్టిన ఈ నిర్మాణాల వల్ల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేశారు. దీంతో, ఈ నిర్మాణాలను జెసిబితో జిహెచ్‌ఎంసి అధికారులు శనివారం కూల్చివేశారు. దీనిపై ప్రభుత్వ ఉన్నత వర్గాల్లో చర్చ జరగడంతో ప్రభుత్వం జిహెచ్‌ఎంసి కమిషనర్‌ను వివరణ కోరింది. జగన్ ఇంటికి సమీపంలో నివాసం ఉండే ఓ మంత్రి ఆదేశాలతోనే జోనల్ కమిషనర్ కూల్చివేత ఉత్తర్వులు ఇచ్చారని తేలడంతో జిహెచ్‌ఎంసి కమిషనర్ సీరియస్‌గా స్పందించారు. ఉన్నతాధికారులకు కనీసం సమాచారం ఇవ్వకుండా ఆదేశాలిచ్చిన ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌ను జిఎడికి అటాచ్ చేస్తూ జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆమ్రపాలి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

శిరోముండనం కేసులో
సుదీర్ఘ పోరాటం

- బాధితులంతా ప్రజా పోరాట యోధులు
- మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు కె సుధ

ప్రజాశక్తి-అమలాపురం (అంబేద్కర్ కోనసీమ జిల్లా)

వెంకటాయపాలెం శిరముండనం కేసులో 28 ఏళ్లపాటు ఎటువంటి రాజకీయ, ఆర్థిక ప్రలోభాలకు లొంగకుండా న్యాయం కోసం పోరాడిన వారంతా బాధితులు కాదని, వారంతా ప్రజా పోరాట యోధులని దామోదరం సంజీవయ్య నేషనల్ లా స్కూల్ ప్రొఫెసర్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ కె.సుధ అన్నారు. 'శిరోముండనం తీర్పు.. నేరానికి తగిన శిక్షేనా? అనే అంశంపై అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని అంబేద్కర్ సామాజిక భవనంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. ప్రముఖ కవి నామాడి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో డాక్టర్ సుధ మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో ఆత్మగౌరవ పోరాటాలు ఈ దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసం జరుగుతున్నవని అభివర్ణించారు. వీటిని వ్యక్తిగత సమస్యలుగా పౌర సమాజం అర్థం చేసుకుంటే దేశ ప్రజాస్వామ్య విలువలకు తీరని అన్యాయం చేసినట్టేనని తెలిపారు. నిరంతర ప్రజా పోరాటాలే న్యాయ, శాసన వ్యవస్థలు సక్రమంగా వ్యవహరించేలా చేయగలుగుతాయని చెప్పారు. రాజకీయ, సామాజిక స్వేచ్ఛ కోసం బాధితులు సుదీర్ఘ పోరాటమే చేశారని తెలిపారు. శిరోముండనం బాధితుడు కోటి చినరాజు మాట్లాడుతూ.. తోట త్రిమూర్తులు అనుచరులు చేస్తున్న రిగ్గింగ్‌ను తాము ఎన్నికల ఏజెంట్లుగా అడ్డుకున్నామని, ఈ నేపథ్యంలోనే శిరోముండనానికి పాల్పడ్డారని తెలిపారు. మరో బాధితుడు చల్లపూడి పట్టాభి రామయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వాలు నిందితులకు అన్ని విధాలా సహకరించడం వల్లే తమకు న్యాయం జరగడానికి సుదీర్ఘకాలం పట్టిందని తెలిపారు. గుబ్బల శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ పోరాటానికి సహకరించిన గుర్రాల పరంజ్యోతి, తిరుమాని సత్యనారాయణ రాజు, కె.బాలగోపాల్, బొజ్జా తారకం తదితరులకు జోహార్లు అర్పించారు. దళిత ఐక్య పోరాట వేదిక నాయకులు వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ.. ప్రజా సంఘాల సమష్టి కృషే శిరోముండనం కేసు విజయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడిద రాజేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రవి, జి.రోహిత్ పాల్గొన్నారు.


తిరుమలలో బాధ్యతలు స్వీకరించిన ఇఒ శ్యామలరావు

టిటిడి ఇఒగా శ్యామలరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానం నూతన ఇఒగా జె.శ్యామలరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. క్షేత్ర సంప్రదాయాన్ని అనుసరించి ముందుగా వరాహ స్వామిని, అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పద్మావతి అతిథిగృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల తిరుపతి దేవస్థానానికి ఇఒగా రావడం తన అదృష్టమని అన్నారు. టిటిడిలో ప్రతిదీ పారదర్శకంగా ఉంటుందని తెలిపారు. సందర్శకుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. సందర్శకులకు సంతృప్తికర దర్శనం కల్పించడమే తన లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో తిరుమలను అభివృద్ధి చేస్తానని తెలిపారు. టిటిడి నిధులు దుబారా కాకుండా సక్రమంగా వినియోగిస్తామని చెప్పారు. గతంలో అవకతవకలు జరిగి ఉంటే విచారణ చేపడుతామని తెలిపారు. అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 17 జూన్ 2024



"సామాజిక జీవితం లేకపోతే
సాహిత్యం అనేదే సాధ్యం కాదు.
ఈ సంగతి జ్ఞప్తిలో ఉంచుకుంటే
సాహిత్యం ఎందుకు? ఎవరికి? అనే
రెండు ప్రశ్నలకూ జవాబు వస్తుంది.
– మహాకవి శ్రీశ్రీ



ఓ గాజా... నువ్వు తప్పక గెలుస్తావు!

ఇప్పుడక్కడ శిథిలాలు తప్ప
నివశించేందుకు ఇండ్లు లేవు
నీటిని వొంపే కుళాయిలు లేవు
తిరుగాడేందుకు రోడ్లు లేవు
చిగురించేందుకు చెట్లు లేవు

బిక్కు, బిక్కుమనే జీవచ్ఛావాలు తప్ప
జీవించే మనుషులూ లేరు
వాళ్ళిప్పుడు తమ పేర్లను, కుటుంబాలను
కోల్పోయారు
తమ ఉపాధిని, వృత్తిని కోల్పోయారు
తమ కళల్ని, కలల్ని కోల్పోయారు
పిల్లలు చిరునవ్వుని, పెద్దలు ధైర్యాన్ని కోల్పోయారు
బూడిదను శ్వాసించి ఆకలిని మింగుతున్నారు
వాళ్లిప్పుడు సొంత గడ్డ మీదనే పరాయిలయ్యారు

అక్కడిప్పుడు అకస్మాత్తుగా
నిశబ్దం గాయపడుతుంది
పెదవి దాటకుండానే ప్రార్ధన మరణిస్తుంది
మానవత్వ సహాయం మీద
మృత్యువు విరుచుకు పడుతుంది

అప్రతిహత మారణకాండలో
శబ్దాలు అర్ధాలు కోల్పోయాయి
ఆసుపత్రులు శ్మశానాలయ్యాయి
అంతర్జాతీయ సమాజం అసహాయ శిబిరంగా
మిగిలింది
ఐక్యరాజ్య సమితి సుద్దుల కేంద్రమైంది

ఓ గాజా, ఓ పాలస్తీనా...

నైతికంగా గెలుపు నీదే అయినా
భౌతికంగా శత్రువు నిన్ను నిర్మూలించొచ్చు
చొరబాటుదారుడే భూమిపుత్రుడ్నని
ప్రకటించుకోవచ్చు
కానీ, వాడిలాగే శకలాల నుంచి మళ్లీ నువ్వెగుస్తావు
నీ ఆత్మ పతాకను తిరిగి ఎగరేసి చూపుతావు
పిరికి ప్రపంచానికి తెగువ ఫలితం ఎలా ఉంటుందో
రుచి చూపించి తీరుతావు!

– వి.ఆర్. తూములూరి, 9705207945

గూడ

పెనుగాలి రాకముందే
పిట్ట తన గూటికి చేరుకున్నట్టు
ఓసారి గూడకు పోయిరావాల ..!
వాగుల్ని వాటర్ పేకెట్లలో బంధించక ముందే
చెట్లకు చెవిదుద్దుల్లా వేలాడే మానిపళ్లను
జ్యూస్ బాటిళ్లలో నింపుకుపోకముందే
అంతటి అడవి సంతగా మారకముందే
ఓసారి గూడకు పోయిరావాల..!

చెట్లు మాయమై సెల్ టవర్లు చిగురించకముందే
కూలిపోయిన మహావృక్షాలు
గుళ్ల ముందర ధ్వజస్తంభాలై నిలబడకముందే
కిరస్తానీ తెల్ల చీకటి కొండల్ని కమ్మేయకముందే
ఓసారి గూడకు పోయిరావాల.. !

పాములా మెలికలు తిరిగే అడవి దారుల్లో
నా పూర్వీకుల పాదముద్రల్ని చెరిపేసిన తార్రోడ్డు
కొండచిలువలా మారి గూడల్ని మింగేయక ముందే
కాళ్లకింద కొండల్ని పిండిజేసీ
నగరాలకు లారీల్లో తరలించుకు పోకముందే
ఓసారి గూడకు పోయిరావాల.. !

ఉచిత పథకాల స్టిక్కర్లన్నీ
గూడల గోడల మీద దిష్టిబొమ్మలై వెక్కిరిస్తున్నచోట
ఆయుధమొనకు వేలాడుతూ ..
అడవి పావురాలు నెత్తురోడుతున్నచోట
అడవొక చెరశాలగా మారకముందే
చెరపడ్డ వాకపల్లిలా గూడ శోకించకముందే
చీకటిబగిడి , పొద్దుమీద రెక్క విప్పార్చకముందే
ఓసారి గూడకు పోయిరావాల.. !

కట్టుదగ్గర గోవు, దూడకోసం ఎదురుజూసినట్టు
అడవితల్లి తన ఆకుల కళ్లతో ఎదురుజూస్తోంది
యే పొదలచాటున యే పులులు పొంచి ఉన్నాయో
యే పుట్టలమాటున
యే పాములు బుసగొడుతున్నాయో
ఓసారి జూసిరావాల .. గూడకు పోయిరావాల ..
నా నేలమీద నా ఉనికిని నిలబెట్టుకోవాల ..
దించేసిన విల్లమ్ములు మళ్లీ చేతబట్టాల..!

– సిరికి స్వామినాయుడు, 94940 10330

నిజం స్పర్శ చవిచూసేదాకా ...

తవ్వకాలు జరగాలి
మెదడు చెదరకుండా
ఎముక విరగకుండా
చూపు చిట్లకుండా
చురుకు చెడకుండా
మెత్తని వేళల్లో సుతిమెత్తని పరికరాలతో
మనసు లోతుల్లో
ఇంకిన ఇష్టాల్లో
పొడిబారిన ప్రేమను తాకేదాకా
కన్నీటి జాలు ఆగిన చోట
కరిగిన కల ఆనవాళ్లు దొరికేదాకా
చెదరిన బతుకు చిరునామా కనిపించేదాకా
నిజం స్పర్శ చవిచూసేదాకా
ఎర్రని వాక్యాలు చేతికి అందేదాకా
మట్టి పొరల్లో మాట చప్పుడు వినిపించేదాకా
పూడిన ముద్రలు పలుకరించేదాకా
అడుగున చేరిన ఆశ నాడిని కనిపెట్టేదాకా
తెగిన ఇష్టపు కొస అందేదాకా

పాత రోజును వెలికి తీస్తూ
కొత్త రోజులతో ముడిని విడదీస్తూ
తవ్వకాలు జరపాలి
తరం ఓడి పోకుండా
మరో తరం చేజారకుండా
నిరంతరం నిజం స్వరం వినిపించేలా
తవ్వకాలు జరగాలి
మనిషి తప్పిదాలు తొలగాలి!

– చందలూరి నారాయణరావు,
97044 37247

ఎడారి బానిసల కన్నీటి వర్షం 'ఆడుజీవితం'



భారతీయ సాహిత్యంలో మలయాళ సాహిత్యం ఒక విశిష్టమైనది. సాధారణ జీవితాల్లోని పచ్చినిజాలను, విస్తారంగా పండించిన సాహిత్య పంటలసత్తువను ప్రదర్శించిన సందర్భాలు కోకొల్లలు. ఆ వరుసలో కష్టాల కన్నీళ్ల వర్షంలో తడిచి ముద్దయిన ఒక వలసకూలీ జీవితపు అంగవస్త్రమే 'బెన్యామిన్' కలం నుంచి వెలువడిన 'ఆడు జీవితం' నవల. రచయిత అసలు పేరు 'బెన్ని డేనియల్'. అతడి కలంపేరు 'బెన్యామిన్'. ఈయన 1971 మే 18వ తేదీన కేరళలోని పతనంతిట్ట జిల్లాలోని ఎన్జెట్టూర్ గ్రామంలో జన్మించాడు. 1992 నుంచి 2013 వరకు బహ్రెయిన్‌లోనూ, మరి కొంతకాలం ఆస్ట్రేలియాలోనూ నివసించాడు. మలయాళ కథా రచయితగా పరిచయమైన ఈయన 2008లో 'ఆడుజీవితం' అనే నవలను ప్రచురించాడు. అది భారీ విజయం సాధించడంతో అతడు మరింత చురుకైన, సుప్రసిద్ధ రచయితగా మారాడు.

సౌదీ అరేబియాలో వలస వచ్చిన కార్మికులను ఎలా బలవంతంగా బానిసలుగా మార్చుతారో వివరించే కథే 'ఆడు జీవితం' నవల. ఘనమైన సాంద్రత కలిగిన సన్నివేశాలతో, అబ్బురపరిచే శిల్ప చాతుర్యంతో, సజీవకత ఉట్టిపడే చిత్రీకరణతో, హృదయాలను ద్రవింపచేసే పాత్రల దృఖంతో, ఆకలి, అసహాయత పోటీపడి మనిషిని కృంగదీస్తూ కన్నీటితో కరచాలనం చేస్తూ ఈ నవల సాగిపోతుంది. చదివిన తరువాత ఈ నవల ఎక్కడికో పారిపోదు. మన జ్ఞాపకాల్లో శాశ్వతంగా నిక్షిప్తమై పోతుంది.

ఈ నవలలోని కథను సంక్షిప్తంగా చర్చించాలంటే, ఈ నవల కథానాయకుడు 'నజీబ్ మహమ్మద్'. కేరళలోని ఒక గ్రామంలో పడవ నడుపుకుంటూ జీవితం సాగిస్తూ వుంటాడు. కొత్తగా వివాహమైంది. క్రమంగా పడవకు గిరాకీ తగ్గటంతో, మెరుగైన ఆదాయం కోసం గల్ఫ్ దేశాలలో ఉద్యోగం చేయాలను కుంటాడు. అదే గ్రామంలో తన చిన్ననాటి స్నేహితుడు 'హకీం' కూడా అదే ప్రయత్నంలో వుంటాడు. ఇద్దరూ కలిసి ఒక ఏజెంట్ సహాయంతో పాసుపోర్టు, వీసాలు సంపాదించి, విమానం ఎక్కి సౌదీలో 'రియాద్' విమానాశ్రయంలో దిగు తారు. తమను స్పాన్సర్ చేసిన వ్యక్తి ఎయిర్ పోర్టుకు రాడు. ఏం చేయాలో, ఎక్కడికి వెళ్లాలో తెలియక బెంబేలు పడుతున్న స్నేహితులిద్దర్ని కొందరు అటుగా ట్రక్కులో వచ్చి బలవంతంగా వాళ్లను ఎక్కించుకుని తీసికెళ్తారు. రెండు గంటల ప్రయాణం తరువాత ఎడారి ప్రాంతం చేరి నజీబ్ ను ఒక చోట, హకీంను మరోచోట దింపి, చివరికి వాళ్లను మేకల, ఒంటెల కాపర్లుగా మారుస్తారు.

ఎడారిలో మేకల మధ్య నజీబ్ జీవితం దుర్భరంగా తయారవుతుంది. రాత్రి పడుకోవటానికి సరైన చోటువుండదు. ఎముకలు కొరికే చలిలో, రోజుల తరబడి ఆకలితో నరకాన్ని అనుభవిస్తాడు నజీబ్. కూర లేకుండా ఎండిపోయిన రొట్టెలు తినటానికి ఇస్తారు, తాగటానికి నీళ్లు సైతం తగినంతగా అందించరు. స్నానానికి అసలు అవకాశం వుండదు. తాను చేస్తున్న పనిని పర్యవేక్షించటానికి ఒక సూపర్వైజర్ దూరం నుంచి బైనాక్యులర్‌తో రోజూ గమనిస్తూనే వుంటాడు. ఏమాత్రం తేడా వచ్చినా శిక్షలు ఘోరాతిఘోరంగా వుంటాయి. మేకల మధ్య బానిస బతుకు నిత్యం కన్నీళ్ల వర్షాన్ని కురిపిస్తూ సాగిపోతూ వుంటుంది. క్షణ క్షణం తన భార్య, తల్లి గుర్తుకు వచ్చి తల్లడిల్లిపోతూ వుంటాడు. తప్పించుకుని పారిపోదామని ఒకసారి ప్రయత్నం చేస్తే, తెలిసి తన యజమాని షూట్ చేస్తాడు. బుల్లెట్ కాలికి తగిలి గాయపడతాడు. తనలాగా తప్పించు కోవటానికి ప్రయత్నించినోళ్లు ఎలా కళేబరాలుగా మారి పోయారో ఇసుకను తవ్వి శవాలను చూపిస్తారు. చూసి వణికి పోతాడు నజీబ్.

తిండిలేక, శరీరానికి సరైన పోషణలేక గడ్డం మీసాలు పెరిగిపోయి, శరీరం శుష్కించిపోయి, కళ్లు లోనికి వెళ్లిపోయి, శరీరం స్నానంలేక పాలిపోయి, వికారంగా తయారయ్యి, ఒంట్లో నుంచి ఎముకలు పొడుచుకుని బయటికి వస్తూ వుంటాయి. ఒకసారి తన గుడారం దగ్గరికి వచ్చిన వ్యాను అద్దంలో తన ముఖాన్ని చూసుకుని, అసలు మనిషి పోలికలు లేని తన వికారమైన ఆకారాన్ని చూసి కెవ్వుమని కేకలు వేసి, బావురుమని ఏడుస్తాడు. ఆ నిస్సహాయ స్థితిలో మేకలలో తానూ ఒక మేకగా బతుకుతూ, రోజూ కన్నీళ్లు తోడుగా జీవిస్తూ వుంటాడు.

యాధృచ్ఛికంగా ఒకరోజు ఎడారిలో తన స్నేహితుడు హకీంను కలుస్తాడు నజీబ్. వీళ్లకుతోడు ఈజిప్టునుంచి వచ్చిన కాదిరీ కూడా జత అవుతాడు. ఒకరి బాధలు ఒకరు చెప్పు కుంటారు. ఒకరి కన్నీళ్లని మరొకరు తుడుస్తారు. ముగ్గురు కలిసి ఈ ఎడారి నరకం నుంచి పారిపోదామని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు. అదునుచూసి ఒకరోజు ముగ్గురు కలిసి పారిపోతారు. ఎన్నిరోజులు నడిచినా ఎడారి తరగటం లేదు. అలసిపోతున్నారు. ఆకలి, దాహం తట్టుకోలేక పోతున్నారు. అడుగులు ముందుకు కదలటంలేదు. అప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్న హకీం మధ్యలోనే ప్రాణాలు వదులుతాడు.



రచయిత బెన్యామిన్

స్నేహితుడి చావును చూసి గుండెలు పగిలేలా ఏడుస్తాడు నజీబ్. స్నేహితుడి శవాన్ని వదల్లేక వదులుతూ కాదిరీతో కలిసి తిరిగి, ప్రయాణం మొదలుపెడతాడు. కొంతదూరం వెళ్లాక ఇసుక తుఫాను కాదిరీని బలి తీసుకుంటుంది. ఏకాకిగా మిగిలి పోతాడు నజీబ్. తనకు ఎడారిలో చావు తప్పదనుకుంటాడు. ఒకరోజంతా నడిచిన తరువాత రోడ్డు కనిపిస్తుంది. విపరీతంగా వాహనాలు వెళు తూ వుంటాయి. ఏ వాహనం ఆగదు. చివరకు ఒక అరబ్ షేక్, నజీబ్‌ను తన వాహనంలో ఎక్కించుకుని టౌన్‌లో దింపుతాడు. కొందరు నజీబ్‌ను చూసి జాలిపడి ఆసుపత్రిలో చేర్పిస్తారు. నజీబ్ దగ్గర పాసుపోర్టు, వీసా వుండవు. అవి లేకుండా సౌదీలో తిరగటం నేరం. ఆ విషయం పోలీసులదాకా వెళ్లి నజీబ్ ను జైలుకు తీసికెళ్తారు..


ఎడారి కంటే జైలుజీవితంలో కొంత స్వేచ్ఛను అనుభవిస్తాడు నజీబ్. జైలులో స్నానం చేయటానికి అవకాశం రాగానే నగ్నంగా పరిగెత్తి స్నానం చేస్తాడు. జైలులో తన మంచితనం చేత అందరి దృష్టిని ఆకర్షిస్తాడు. పారిపోయి వచ్చిన బానిసల కోసం ఆయా యజమానులు జైళ్లకు వచ్చినప్పుడు, ఖైదీలను హాజరుపరుస్తూ వుంటారు. తమ పనివాళ్లను గుర్తుపట్టిన యజమానులు తిరిగి వాళ్లను తమ వెంట తీసికెళ్లిపోతూ వుంటారు. ఆ క్రమంలో నజీబ్ యజమాని కూడా ఆ జైలుకు వచ్చి నజీబ్ గురించి వెదుకు తాడు. ఇప్పుడు నజీబ్ కు గడ్డం, మీసాలు లేవు. కొంచెం ఆరోగ్యంగా కూడా వున్నాడు. జైలుకొచ్చిన నజీబ్ యజమాని అతన్ని గుర్తించలేకపోతాడు. చివరకు తనకథంతా తెలుసుకున్న జైలరు, నజీబ్ జీవితంపట్ల చాలా సానుభూతిని ప్రకటించి, నజీబ్ విడుదల కోసం సహాయం చేస్తాడు. మొత్తంమీద సౌదీ అరేబియా, ఇండియా ప్రభుత్వాల మధ్య చర్చలు జరిగి నజీబ్ లాంటి వలస కూలీలను స్వదేశానికి తిరిగిరావటానికి ఒక విమానాన్ని ఏర్పాటు చేస్తారు. నజీబ్ జైలునుంచి విడుదలై విమానం ఎక్కుతాడు. లోపల అంతా తనలాంటివాళ్లే. వాళ్ళంతా ఆ క్షణంలో మేకల్లాగా కనిపిస్తారు. తానూ ఆ మేకల్లో ఒక మేకై ఆ మందలో కూర్చుంటాడు, విమానం గాలిలోకి ఎగురుతుంది, నవల ముగుస్తుంది.

వాస్తవంగా నజీబ్ అనే వ్యక్తి గల్ఫ్ ఎడారుల్లో బానిస జీవితాన్ని అనుభవించి వచ్చినవాడు. అతడి నిజ జీవితాన్ని ప్రేరణగా తీసుకుని 'బెన్యామిన్' ఈ నవల రాశాడు. ఈ రచన ద్వారా కేరళ సాహిత్య ఆకాడమీ యువ పురస్కారాన్ని అందుకున్న 'బెన్యామిన్' 2021లో 'మంథలిరిలే' అనే నవలకు 'వాయిలార్' అవార్డును అందుకోవడమే కాకుండా 'మ్యాన్ ఏసియన్ లిటరరీ ప్రైజ్ కు ఎన్నికయ్యాడు కూడా. 2008లో అబుదాబి అవార్డు, 2015లో పద్మప్రభ సాహిత్య పురస్కారం, 2019లో 'ముత్తాతు వర్కీ అవార్డు ఈ నవలకు లభించాయి. ఈ నవల అరబిక్, నేపాలీ, తమిళం, ఒడియా, థాయ్ భాషల్లోకి అనువాదమైంది. 'కేరళ లిటరరీ అవార్డు'తో పాటు, దక్షిణ సాహిత్య బహుమతి కోసం ఎంపికైంది. కేరళలో నాలుగు విశ్వవిద్యాలయాల్లో ఈ నవల పాఠ్యాంశంగా ఉంది. ఈ నవలను 'జోషఫ్ కోయిపల్లి' ఇంగ్లీషులోకి 'ది గోట్ డేస్' పేరుతో అనువాదం చేశాడు. ఇంగ్లీషులోకి ఈ నవల వచ్చాక దీనిని జెట్ మీడియా ప్రొడక్షన్స్, అల్టాగ్లోబల్ మీడియా కలిసి 'ది గోట్ లైఫ్' పేరుతో సినిమా నిర్మించారు. ఈ సినిమాను ఆస్కార్ అవార్డుకోసం పంపుతారనే వార్త కూడా వినిపిస్తోంది.

ఈ నవల పాఠకులను మైమరపించటమే కాదు, హృదయాన్ని కదిలించి కన్నీరు కార్పించగల సత్తా కలిగిన ఉత్తమ మలయాళ నవల 'ఆడుజీవితం'. సన్నివేశాల రూపకల్పనలో రచయిత పాటించిన సాహిత్య ప్రమాణాలు, నవల నడకలో సాగిన చిక్కదనం, పాత్రల రూపకల్పన వగైరాలు చాలాకాలంపాటు పాఠకులకు గుర్తుండిపోతాయి. మరచిపోలేని ఒక గొప్ప సాహిత్య సంపదను ఆత్మీయంగా అందించిన 'ఆడుజీవితం' నవల రచయిత 'బెన్యామిన్'కు హృదయపూర్వక అభినందనలు.

– డా.కె.జి.వేణు
98480 70084

చేదు నిజాల కథల గని 'మధుపురి'



రాహుల్ సాంకృత్యాయన్ పేరు వినగానే ఓల్గా నుంచి గంగకు, దివోదాస్ లోక సంచారి, మధురస్వప్నం, ఋగ్వేద ఆర్యులు, సింహసేనాపతి వంటి రచనలు గుర్తుకు వస్తాయి. ఇవన్నీ చరిత్రను శోధించి అయన రాసిన గ్రంథాలే. ఆయన ప్రత్యేకంగా ఓ ప్రాంతంలో కొంతకాలంగా జరిగిన మార్పులను తీసుకొని కథలు కూడా రాశారని 'మధుపురి' పుస్తకం చూసిన తరువాతే నాకు తెలిసింది. దీనిలో మొత్తం 21 కథలున్నాయి. ఈ కథలు మధుపురి అనే ఓ వేసవి విడిది ప్రాంతంలో జరిగిన చారిత్రిక పరిణామ క్రమాన్ని మనకు కళ్ళకు కట్టినట్టు చూపిస్తాయి. ఈ పుస్తకం తొలుత 'బహురంగీ మధుపురి' అనే పేరుతో హిందీలో 1954లో వెలువడింది. దీనిని కవిని ఆలూరి తెలుగులోకి 2016లో అనువదించారు.

'మధు' అంటే మద్యం. 'పురి' అంటే నిలయం. 'మధుపురి' అంటే మద్యానికి నిలయం అని అర్ధమని ఈ పుస్తకంలోనే ఓ కథలో రచయిత ప్రస్తావించారు. మధుపురి ఢిల్లీకి నాలుగు గంటల ప్రయాణ దూరంలో ఎత్తైన ప్రాంతంలో బ్రిటిష్ వారు ఏర్పాటు చేసుకున్న ఓ వేసవి విడిది కేంద్రం. వేసవిలో ఆ ప్రాంతమంతా బ్రిటిష్ వారితో చాలా సందడిగా ఉండేది. భారతదేశానికి స్వాతంత్రం వచ్చినాక బ్రిటిష్ వారి స్థానంలో భారతదేశ ఉన్నత వర్గీయలతో ఈ ప్రాంతం కళకళలాడింది. బ్రిటిష్, భారత ఉన్నత వర్గీయ సంస్కృతీ సంప్రాదాయాలు ఇదివరకే అక్కడ వున్న స్థానిక గిరిజన సంప్రాదాయాలను వారి జీవితాలను ఎలా అతలాకుతలం చేశాయి? పై వర్గీయుల కట్టుబాట్లు, అలవాట్లు అక్కడికి వచ్చిన మధ్య తరగతి వర్గీయులను ఎంతలా ప్రభావితం చేశాయి? ఉపాధిని వెతుక్కుంటూ మధుపురికి వచ్చిన దిగువ వర్గపు ప్రజల జీవితాల స్థితిగతులు ఏమిటి? ఈ ప్రశ్నలకు జవాబులను ఈ కథలు మనకు చూపిస్తాయి.

ఓ మూడు కథల గురించి ఇక్కడ ముచ్చటించు కుందాం. 'రూపీ' అనే కథ పైన పేర్కొన్న మొదటి కేటగిరికి చెందింది. రూపీ పేరుకు తగ్గట్టుగానే లావణ్యవతి. రూపీ వాళ్ళమ్మ మొదట్లో ఓ సైనికుడితో కలిసి జీవిస్తుంది. వారిద్దరికి కలిగిన సంతానమే రూపీ. సైనికుడు చనిపోయిన తరువాత మధుపురిలోనే ఓ బంగళా కాపలాదారున్ని ఈమె మరలా పెళ్లి చేసుకుంటుంది. బతకడానికై సారాయి వ్యాపారం చేస్తుంటుంది. కూతురు రూపీని వాళ్ళ సంస్కృతిలో భాగంగా ఏ మగాడికైనా పెళ్లి అనే పద్ధతిలో ఒక్కసారిగా అమ్ముకుంటే వచ్చే ఆదాయం కన్నా... రోజూ అమ్ముకుంటే బావుంటుందని వేశ్యావృత్తిలోకి దింపుతుంది. 'బావి, లత, నావ, వేశ్య భేద భావం లేకుండా అందరికీ సేవచేయాలి' అని శూద్రుకుడు 'మృచ్ఛకటిక'లో చెప్పినట్టు ఇలా సేవ చేసి చివరికి రూపీ సుఖరోగాల పాలయి తన జీవితాన్ని నరకప్రాయం చేసుకుంటుంది ఈ కథలో. 'లిప్ స్టిక్' అనే కథ ... పైన నేను చేసిన విభజనలో రెండో కోవకు చెందిన కథ. హిందూ స్త్రీ... బొట్టును ఎంత పవిత్రంగా భావిస్తుందో దొరసానులు లిప్‌స్టిక్‌కు అంతే ప్రాధాన్యతను ఇస్తారు అంటాడు రచయత. ఈ లిప్‌స్టిక్ మధ్య తరగతి వ్యాపార వర్గీయుల్లో ఎంతగా ప్రభావం చూపిందో చెబుతుంది ఈ కథ. ఉన్నత వర్గీయ స్త్రీలు వాడే ఖరీదైన లిప్‌స్టిక్ వాడలేక చవకైన లిప్‌స్టిక్ వాడి మధ్య తరగతి స్త్రీలు తమ అందమైన పెదవులను పాడు చేసుకుంటున్నారని; నిత్య అవసరాలకు ఆడవాళ్లు మగవాడిపై ఆధారపడినన్నాళ్లు ఆడది తన అందంపై ఆధారపడక తప్పదని; ఆడది తన కాళ్లపై తానే సొంతంగా నిలబడే రోజు ఒకటి వస్తుందని; ఆరోజు వచ్చినాక ఇక లిప్‌స్టిక్ లతో పని ఉండదని; ఒకవేళ వున్నా లిప్ స్టిక్‌లు అన్నీ ఒకేలాంటి ధరకు అందరికీ అందుబాటులోకి వస్తాయని ఈ కథ చెబుతుంది. 'గోలూ' అనేది మూడో కోవకు చెందిన కథ. ఉపాధికై మధుపురికి వలసవచ్చిన ఓ కూలివాడి కథ. ఇంటికి పెద్దవాడిగా తండ్రితో సమానంగా ఇంటి బాధ్యతను తన నెత్తికెత్తుకోవాల్సి వస్తుంది గోలూకు. తల్లి మరణించాక సామాన్లు మోసే కూలీగా పనిచేయడానికై మధుపురికి వస్తాడు. ఇక్కడ కూడా నేపాలీ కూలీలతో పోటీపడలేకపోతాడు. తరువాత రిక్షా లాగే పనిలోకి కుదురుతాడు. రాత్రీ పగలూ తాను సంపాదించిన సొమ్మును ఊరిలోని తండ్రికి పంపితే ఆ డబ్బులతో తండ్రి కొడుకుకు పెళ్ళి చేయాల్సింది పోయి తనే రెండో పెళ్లి చేసుకుంటాడు. కొడుకుకు త్వరగా పెళ్ళి చేస్తే తనకు ఎక్కడ దూరమైపోయి డబ్బులు పంపడం మానేస్తాడోనని పెళ్ళి చేయడు. సవతి తల్లి, ఆవిడ సంతాన భారాన్ని కూడా గోలూయే మోస్తుంటాడు. పెళ్ళిచేయకపోతే తన చేయి ఎక్కడ చేయదాటిపోతాడో అని భావించి పెళ్లి వయసు దాటి చాలా ఏళ్ళు గడిచాక గోలూకు పెళ్లి చేస్తాడు తండ్రి. మధుపురికి తీసుకువస్తే ఎక్కడ తన భార్య బ్రిటిష్ సైనికుల చేతిలో అత్యాచారానికి గురవుతుందోననే భయంతో, ఖర్చులు పెరిగి సంపాదన తగ్గిపోతుందనే భయంతో మధుపురికి తీసుకురాడు. కొన్నాళ్లకు కనుచూపు పోవడంతో సొంత ఊరికి వెళ్ళిపోతాడు. అంతవరకు కుటుంబాన్ని తన భుజస్కంధాలపై మోసిన తాను ఇప్పుడు కుటుంబానికి భారంగా మారతాడు. అన్న భార్యను తమ్ముడు స్వీకరించే పద్ధతి తమ జాతిలో వుంది కాబట్టి తన భార్య తన తమ్ముడిని పెళ్లి చేసుకుంటుంది. స్నేహితుడి సహాయంతో మధుపురికి వచ్చి వైద్యం ద్వారా గోలూ కంటి చూపును తిరిగి పొందుతాడు. దొరికినప్పుడు చేతనైన పని చేసుకుంటూ ఖాళీ సమయాల్లో వంటకు అవసరమైన పుల్లలేరుకుంటూ మధుపురిలో కనిపిస్తుంటాడు గోలూ అంటూ కథను ముగిస్తాడు రచయత.

అదేవిధంగా రెండు విభిన్న వర్గాలకు చెందిన పిల్లల మధ్య ఓ స్వచ్ఛంగా చిగురించిన స్నేహం... ఎడబాటుకు గురై దిగువ వర్గానికి చెందిన 'చంపో' చావుకు ఎలా కారణమయ్యిందో 'చంపో' కథ వివరిస్తుంది. ఉన్నత వర్గానికి చెందిన దొరసానులు మధ్య తరగతి, దిగువ వర్గాల వారికి ఇవ్వాల్సిన డబ్బులెలా ఎగ్గొడుతుంటారో అని 'అయ్యో ముసలితనం' అనే కథలో చదివి తెలుసుకోవొచ్చు. ఈ పుస్తకంలో వున్నవి 21 కథలు కాదు; 21 జీవితాలు, మధుపురి చరిత్ర చెప్పిన చేదు నిజాలు. ఒకానొక సంధికాలంలో భారత సమాజంలోకి చొచ్చుకొచ్చిన కొన్ని పతన విలువల స్వరూపాన్ని, మానవ సంబంధాల్లోని కాఠిన్య కోణాలను తెలుసుకోవాలంటే ఈ పుస్తకం తప్పక చదవాలి.

– మొయిద శ్రీనివాసరావు
99082 56267



'స్వప్నం రాల్చిన అమృతం' నాటికలో ఒక సన్నివేశం



'విముక్తి' నాటికలో ఒక దృశ్యం

అలరించిన 'హర్ష' నాటికలు

ఆర్టిస్టులే ఆర్గనైజర్లయ్యి, పరిషత్ నిర్వహిస్తే అది 'హర్ష క్రియేషన్స్' అవుతుంది. తెలుగు సాంఘిక నాటకాన్ని బతికించాలనే ధ్యేయంతో తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా పోటీలు (పరిషత్) జరుగుతున్నాయి. ఉమ్మడి ఏపీలో సుమారు 70 వరకూ పరిషత్తులు ఉండొచ్చని, క్రమం తప్పకుండా ఏటా పోటీలు నిర్వహించేవి కనీసం సగానికి తగ్గకుండా ఉంటాయని ఓ అంచనా. ఈ నెల 12, 13, 14 తేదీల్లో విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో హర్ష క్రియేషన్స్ వారు (కత్తి శ్యామ్ ప్రసాద్ టీమ్) వరుసగా ఏడో సంవత్సరం తెలుగు రాష్ట్రాల స్థాయిలో సాంఘిక నాటికల పోటీలు నిర్వహించారు. సామాజిక, కుటుంబ నేపథ్యంతో.. భిన్న కోణాల్లో... వివిధ ప్రాంతాల నుంచి తొమ్మిది నాటికలను ప్రదర్శిం చారు. ఇందులోని ఎక్కువ నాటికలు ప్రేక్షకుల్ని అలరించాయి.

స్వప్న అనే వేశ్య అల్లిన చిన్న కథ (అబద్ధం) అమృతమై– కనువిప్పు కలిగించి, కడకు భార్యను అక్కున చేర్చుకున్న ఉదంతం 'స్వప్నం రాల్చిన అమృతం' ఇతివృత్తం. భర్త తప్ప తాగి చేసిన యాక్సిడెంట్ కారణంగా నడుం నుంచి కింది వరకూ చచ్చుబడిపోయి, ఓ మూలన ఒంటరిగా.. నిరంతరం బాధతో విలవిల్లాడుతూ– డేకుతూ.. భర్త హూంకరింపులతో..

హృదయ విదారక పాత్రలో జ్యోతిరాణి జీవించి.. నాటికకు ప్రాణం పోసింది. ఉత్తమ ప్రదర్శన బహుమతి సాధనకు ఇతోధికంగా దోహదపడటమే కాదు; ఉత్తమ నటి బహుమతినీ దక్కించుకుంది. ఈ నాటిక రచన శివరామ్, దర్శకత్వం మంచాల రమేష్.

ఆత్మీయంగా, ఆంతరంగికంగా మనసు విప్పి మాట్లాడు కోకుంటే కాపురాలు కూలే ప్రమాదముందని హెచ్చరిస్తుంది మాడభూషి దివాకర్ బాబు 'మాట్లాడుకుందాం' నాటిక. ఇందులో ఇల్లాలు పక్కదారి పట్టడానికి బలమైన, కన్విన్సింగ్ కారణం చూప(లే)కపోవడం లోపమనిపించినా నాటకీయతలో.. రన్నింగ్‌లో దివాకర్ బాబు చేయి తిరిగిన రచయిత. ఈ నాటికతో మంజునాథ ఉత్తమ దర్శకుడిగా, ద్వితీయ ఉత్తమ ప్రదర్శన బహుమతిని సాధించుకుంది సిరిమువ్వ కల్చరల్, హైదరాబాద్ బృందం.

మోసం, కుట్రతో తల్లిదండ్రుల నుంచి ఆస్తి కాజేయాలని చూసిన కొడుకులకు 'అనూహ్యం'గా బుద్ధి చెప్పడాన్ని ఆకట్టుకునేలా ప్రదర్శించారు నటీ నట సంక్షేమ సమాఖ్య, పాలకొల్లు కళాకారులు. రచన తాళాబత్తుల వెంకటేశ్వరరావు, దర్శకత్వం కత్తుల రామ్ మోహనరావు. పిల్లల్ని దత్తత తీసుకోవడాన్ని సాధారణంగా గమనిస్తుంటాం. అనాథగా పెరిగి, అమెరికాలో మంచి హోదాలో ఉండి... వృద్ధ దంపతులను తల్లిదండ్రులుగా దత్తత తీసుకునే ఇతివృత్తాన్ని ఎంచుకున్నారు రచయిత శారదా ప్రసన్న. 'ఎడారిలో వానచినుకు'గా ప్రదర్శితమైన ఈ నాటికను సాయి కార్తీక్ క్రియేషన్స్, కాకినాడ వారు ప్రదర్శించి, ఆకట్టుకున్నారు.

వాతావరణ కాలుష్యానికి ప్లాస్టిక్ పరిశ్రమలు ఎలా కారణమవుతున్నాయో, లాభాపేక్షతో మనుషుల ప్రాణాలతో ఎలా చెలగాటమాడుతున్నాయో... బ్రహ్మ 'రాత'ను ఎలా తిరగరాస్తున్నాయో నాటకీయంగా, శక్తివంతంగా చెప్పే ప్రయత్నం చేశారు వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ కళాకారులు. ఆడపిల్లలను బతకనిద్దాం, బతికించుకుందాం అనే సందేశాన్నిచ్చింది 'క్షేత్రం'. శిల్ప ఆకురాతి రచనను జి.వి.మనోహర్ దర్శకత్వంలో ఆరాధన ఆర్ట్స్ అకాడమీ, గుంటూరు కళాకారులు ప్రదర్శించారు. స్త్రీమూర్తులు కడుపుపంట పండించకపోతే మానవ సృష్టే ఉండదని చెప్పే క్రమంలో.. కనీసం ఒకటిరెండు పదాల్లోనైనా– పురుష ప్రమేయాన్ని కూడా జోడిస్తే రచనకు సమగ్రత, సమతూకం చేకూరేవి.

యువతను గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి ప్రాణాంతక మత్తు పదార్థాల దురలవాటు నుంచి 'విముక్తి' చేయాల్సిన ఆవశ్యకతను రచయిత, దర్శకుడు, ప్రధాన పాత్రధారి చెరుకూరి సాంబశివరావు సిన్సియర్‌గా చెప్పే ప్రయత్నం చేశారు. ఈ నాటికను ఉషోదయా కళానికేతన్, కట్రపాడు వారు ప్రదర్శించారు. ఇంకా... బంధం (రచన: మాడుగుల రామకృష్ణ, దర్శకత్వం: పురుషోత్తం) మైత్రీ కళానిలయం, విజయవాడ; నాన్న బంగారు (రచన, దర్శకత్వం జి.బి.కె.మూర్తి) ప్రియదర్శిని, నెల్లూరు వారు ప్రదర్శించారు.

ఎక్కువ సందర్భాల్లో విజేతలుగా నిలుస్తున్న సమాజాలను (కొన్నింటినైనా) మినహాయించి కొత్తవారికి అవకాశం ఇవ్వాలనుకున్నారేమో 'హర్ష' నిర్వాహకులు. ఎంపికైన ప్రదర్శనల్లో ఆ తరహా కొత్తదనం కనిపించింది. అది వాస్తవమే అయితే ఓ కోణంలో సమర్ధనీయమే! అయితే పోటీ అంటే హోరాహోరీ ప్రదర్శనలనే ఆశిస్తారు ప్రేక్షక దేవుళ్లు. కొత్త టీములకు అవకాశం కల్పించాలంటే పోటీలు కాకుండా 'ఉత్సవాలు'గా నిర్వహిస్తే ఎలాంటి ఆక్షేపణలకూ ఆస్కారముండదు. సాధారణంగా పోటీల నిర్వాహకుల నుంచి న్యాయ నిర్ణేతలుగా ఎవరూ ఉండరు. ఈ పరిషత్‌లో మాత్రం ఈసారి ఏకంగా ముగ్గురిలో ఇద్దరు పరిషత్ నిర్వహణ బృందంలోని వారే ఉన్నారు. 'నాటకాలు ప్రదర్శిస్తున్న వారే కాదు, పోటీలకు వెళు తున్న వారూ ఏ పరిషత్ లోనూ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించడం కరెక్ట్ కాదని– నాటక రంగానికి చెందిన ప్రముఖుడు, పలు నందుల విజేత ఈ సమీక్షకుడితో అన్నారు. ఈ వ్యాఖ్య సమంజసమే అనిపించింది.

విజేతలు : ఉత్తమ ప్రదర్శన – స్వప్నం రాల్చిన అమృతం (చైతన్య కళాభారతి, కరీంనగర్.. ప్రదర్శన పారితోషికం కాకుండా రూ. 10,116), ద్వితీయ ఉత్తమ ప్రదర్శన – మాట్లాడుకుందాం (రూ.6 వేలు), తృతీయ ఉత్తమ ప్రదర్శన – అనూహ్యం (రూ. 3 వేలు). రూ. వెయ్యి వంతున నగదు బహుమతుల వివరాలు : ఉత్తమ రచన – ఎడారిలో వానచినుకు (శారదా ప్రసన్న), ద్వితీయ ఉత్తమ రచన – అనూహ్యం (తాళాబత్తుల వెంకటేశ్వరరావు), ఉత్తమ నటుడు – డి రాధాకృష్ణ (ఎడారిలో వానచినుకు), ఉత్తమ ద్వితీయ నటుడు – రాజరుషి (అనూహ్యం), ఉత్తమ ద్వితీయ నటి – సింధూర పూజిత (మాట్లాడుకుందాం), ఉత్తమ విలన్ – బి దొరబాబు (ఎడారిలో వానచినుకు), ఉత్తమ బాల నటి – సురభి వాగ్దేవి (రాత). సాంకేతిక వర్గంతో సహా మరిన్ని బహుమతులు అందించారు. న్యాయనిర్ణేతలు : అనంత హృదయరాజ్, పిళ్లా నటరాజ్, అడపా సూరిబాబు.

నిర్వాహకులు ఎన్నో ప్రయాసలకోర్చి పరిషత్‌ని నిర్వహిస్తే ప్రేక్షకులు అంతంతమాత్రంగానే రావడం కాస్త నిరాశ కలిగించింది. ఆడిటోరియంలో మైక్ సిస్టమ్ ఈసారి ఇబ్బంది కలిగించింది. థియేటర్ యాజమాన్యం ఈ లోపాన్ని సరిదిద్దాలి. కత్తి శ్యామ్ అండ్ టీమ్‌ను అతిథులుగా హాజరైన వివిధ ప్రాంతాల పరిషత్‌ల నిర్వాహకులతో పాటు ప్రేక్షకులు అభినందించారు.

– జి.వి.రంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్

నీట్ ఓ పెద్ద స్కామ్ అనడానికి గుజరాతే నిదర్శనం :

- ఎంకె స్టాలిన్

చెన్నై : ప్రతిభకు కొలమానంగా ఉండాల్సిన నీట్ పరీక్ష సమాజంలో ప్రజలందరిపై ప్రభావం చూపే స్కామ్‌కు వేదికని పదేపదే రుజువైందని తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షులు ఎంకె స్టాలిన్ విమర్శించారు. నీట్ అక్రమాల్లో అనేకమంది ఉపాధ్యాయులు, కోచింగ్ సెంటర్ల ప్రమేయం ఉందని గుజరాత్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఈ పరీక్షలో జరగాల్సిన 'తక్షణావసరమైన వ్యవస్థాగత మార్పుల'ను ప్రస్తావిస్తుందని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'విద్యార్థులకు, సామాజిక న్యాయానికి, పేదలకు వ్యతిరేకమైన నీట్ వ్యవస్థను రక్షించడాన్ని కేంద్ర ప్రభుత్వం ఇకనైనా ఆపాలి' అని డిమాండ్ చేశారు. నీట్ చుట్టూ కొనసాగుతున్న వివాదాలు ప్రాథమికంగా ఉన్న అసమాన స్వభావాన్ని ఎత్తిచూపుతున్నాయని తెలిపారు. 'వేల సంవత్సరాలుగా విద్య నిరాకరించబడిన అణగారిన ప్రజల అభ్యున్నతి కోసం మనం మరిన్ని అవకాశాలను అందించాలి. దీనికి విరుద్ధంగా అటువంటి విద్యార్థుల అవకాశాలను నీట్ అడ్డుకుంటుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను కేంద్ర విద్యా మంత్రి సమర్థించినప్పటికీ అందుకు భిన్నమైన సంఘటనలు జరుగుతున్నాయి' అని స్టాలిన్ పేర్కొన్నారు.

తొమ్మిది మంది నీట్ అభ్యర్థులకు బీహార్ పోలీసుల నోటీసులు

న్యూఢిల్లీ : నీట్ పరీక్షా పత్రం లీక్‌కు సంబంధించిన కేసులో విచారణకు హాజరుకావాలని కోరుతూ తొమ్మిదిమంది నీట్ యుజి అభ్యర్థులకు బీహార్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ తొమ్మిది మంది విద్యార్థుల్లో ఏడుగురు బీహార్‌కు చెందిన వారు కాగా, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. రాష్ట్ర డిఐజి (ఆర్థిక నేరాల విభాగం) మనవిజిత్‌సింగ్ ధిల్లాన్ మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పటికే నలుగురు అభ్యర్థులను బీహార్ పోలీసులు అరెస్టు చేశారు. మే 5న పరీక్ష జరగడానికి ఒక రోజు ముందే నీట్ పరీక్షా పత్రం, జవాబులు అందాయనే ఆరోపణలతో వీరిని అరెస్టు చేశారు. మే 5న జరిగిన పరీక్షలో దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ పరీక్ష పేపర్ లీకయిందని, పరీక్షా నిర్వహణలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బీహార్ పోలీసుల సిట్ దర్యాప్తు ప్రారంభించింది. ఇప్పటికే నలుగురు అభ్యర్థులతో సహా 13 మందిని బీహార్ పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు గుజరాత్ పోలీసులు కూడా ఇదే ఆరోపణలపై విచారణ ప్రారంభించారు. ఇప్పటికే ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు.

పడవ బోల్తాపడి నలుగురు మృతి

బీహార్ : బీహార్‌లోని పాట్నాలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. 17 మందితో వెళుతున్న పడవ గంగానదిలో మునిగిపోయింది. నలుగురు నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. మరో 13 మంది ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. పాట్నా జిల్లా బార్హ్ సబ్ డివిజన్ పరిధిలోని ఉమంత ఘాట్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఆదివారం గంగా నదిలో స్నానం చేసి అవతలి ఒడ్డుకు వెళ్లేందుకు పడవ ఎక్కారు. నది మధ్యలోకి వెళ్లిన తర్వాత పడవ మునిగిపోయిందని తెలిపారు. పడవ సామర్థ్యం కన్నా ఎక్కువ మంది ఎక్కడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. సంఘటన సమాచారం తెలిసిన వెంటనే ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ దళాలు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

కోటాలో మరో జెఇఇ విద్యార్థి ఆత్మహత్య

కోటా : రాజస్థాన్‌లోని కోటా నగరంలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌లోని మోతీహారీకి చెందిన ఆయుష్ జైస్వాల్ (17) రెండేళ్లుగా మహావీర్ నగర్ ప్రాంతంలో నివాసముంటూ జెఇఇకి ప్రిపేర్ అవుతున్నాడు. శనివారం అర్ధరాత్రి తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం జైస్వాల్ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన అతని స్నేహితులు తలుపులు పగులగొట్టగా ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని..న్యూ మెడికల్ ఆస్పత్రికి తరలించారు. దీంతో ఈ ఏడాది ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల సంఖ్య 11కు చేరుకుంది.

చిల్డ్రన్స్ వాటర్‌పార్క్‌లో కాల్పులు

- 8 మందికి గాయాలు

వాషింగ్టన్ : అమెరికాలో మరోసారి తుపాకుల మోత మోగింది. మిచిగాన్‌లోని చిల్డ్రన్స్ వాటర్ పార్క్‌లో శనివారం ఓ దుండగుడు కాల్పులకు దిగాడు. ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు సహా 8 మంది గాయపడ్డారు. అనంతరం నిందితుడు పోలీసుల కాల్పుల్లో మరణించాడని ఓక్లాండ్ కౌంటీ షెరీఫ్ మైఖేల్ బొకార్డ్ తెలిపారు. కాల్పులకు గల కారణాలు తెలియాల్సి వుంది. వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం ఐదుగంటలకు వాటర్‌పార్క్‌కు చేరుకున్న నిందితుడు వాహనం నుండి దిగుతూనే కాల్పులకు దిగాడు. గన్‌ను రీలోడ్ చేస్తూ సుమారు 28 సార్లు కాల్పులు జరిపాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. సమీప నివాసంలో దాక్కున్న నిందితుడు పోలీసుల కాల్పుల్లో మరణించాడు. రోచెస్టర్ హిల్స్‌లోని బ్రూక్‌లాండ్స్ ప్లాజా స్ప్లాష్ ప్యాడ్‌లో జరిగిన కాల్పుల్లో తొమ్మిది, పది మంది దాకా గాయపడ్డారని, వారిని ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు. అమెరికాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 215 కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి.

అది 'మూడు గోపురాల నిర్మాణ'మట !

- బాబ్రీ మసీదు పేరే ఎత్తని ఎన్‌సిఇఆర్‌టి



న్యూఢిల్లీ : బాబ్రీ మసీదు పేరు కూడా తలవడానికి ఎన్‌సిఇఆర్‌టి ఇష్టపడడం లేదు. గత పదేళ్లుగా చరిత్రను, సామాజిక శాస్త్రాలను కాషాయీకరణ చేస్తున్న మోడీ సర్కారు తాజాగా సరికొత్త వివాదానికి తెరలేపింది. జాతీయ విద్యా పరిశోధనా మండలి (ఎన్‌సిఇఆర్‌టి) తన 12వ తరగతి రాజకీయ శాస్త్రం పాఠ్య పుస్తకంలో అయోధ్యలోని బాబ్రీ మసీదు పేరును ప్రస్తావించకుండా దానిని 'మూడు గోపురాల నిర్మాణం'గా చెప్పుకొచ్చింది. దీనిని 16వ శతాబ్దిలో మొఘల్ చక్రవర్తి బాబర్ వద్ద జనరల్‌గా పనిచేసిన మిర్ బాఖీ రామమందిరాన్ని కూల్చి నిర్మించాడని పేర్కొంది. 'ఈ నిర్మాణంలో హిందూ చిహ్నాలు స్పష్టంగా కన్పించాయి. నిర్మాణం లోపల, బయట కూడా కొన్ని హిందూ కట్టడాలకు చెందిన అవశేషాలు ఉన్నాయి' అని వివరించింది. ఎల్‌కె అద్వానీ నాయకత్వంలో బిజెపి నిర్వహించిన రథయాత్ర, అందులో భాగంగా జరిగిన అల్లర్లకు సంబంధించిన అంశాలను పుస్తకం నుంచి తొలగించారు. మసీదు కూల్చివేత, రామజన్మభూమి ఆందోళనల ప్రస్తావన లేకుండానే కొత్త పాఠ్య పుస్తకాన్ని తయారు చేశారు.

16వ శతాబ్దం నాటి బాబ్రీ మసీదును మిర్ బాఖీ నిర్మించాడని పాత పాఠ్య పుస్తకంలో ఉంది. ఎన్‌సిఇఆర్‌టి కొత్త పాఠ్య పుస్తకంలో అయోధ్య పాఠ్యాంశానికి కేవలం రెండు పేజీలు మాత్రమే కేటాయించారు. గతంలో నాలుగు పేజీల పాఠ్యాంశం ఉండేది. ఫైజాబాద్ జిల్లా కోర్టు ఆదేశాల మేరకు 1986 ఫిబ్రవరిలో బాబ్రీ మసీదు తాళాలు తెరిచారని, ఆ తర్వాత ఇరు పక్షాలు అక్కడ మోహరించాయని పాత పుస్తకంలో ఉంది. అయోధ్యలో జరుగుతున్న పరిణామాలపై బిజెపి విచారం వ్యక్తం చేసిందని అందులో చెప్పారు. అయోధ్య వివాదం లౌకికవాదంపై చర్చకు దారితీసిందని కూడా తెలిపారు. కొత్త పుస్తకంలో ఇవేవీ లేవు. 'నిర్మాణం తలుపులు తెరవాలని, ప్రార్థనలు చేసుకునేందుకు ప్రజలను అనుమతించాలని ఫైజాబాద్ (ఇప్పుడు అయోధ్య) జిల్లా కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో 1986లో మూడు గోపురాల నిర్మాణానికి సంబంధించిన పరిస్థితిలో గణనీయమైన మార్పు వచ్చింది. ఈ వివాదం అనేక దశాబ్దాల పాటు కొనసాగింది. ఆలయాన్ని కూలదోసి శ్రీరామ జన్మస్థలిలో మూడు గోపురాల నిర్మాణం జరిపారని ప్రజలు విశ్వసించడంతో వివాదం మొదలైంది' అని మాత్రమే కొత్త పాఠ్య పుస్తకంలో రాశారు. శ్రీరాముడి జన్మస్థలిని విస్మరించారని హిందువులు ఆందోళన వ్యక్తం చేశారని, నిర్మాణాన్ని తమ ఆధీనంలోనే ఉంచేలా హామీ ఇవ్వాలని ముస్లింలు కోరారని కొత్త పుస్తకంలో తెలియజేశారు. వార్తా పత్రికల్లో వచ్చిన కథనాల క్లిప్పింగులను కూడా పాత పాఠ్య పుస్తకంలో చేర్చారు. 'బాబ్రీ మసీదు కూల్చివేత : కల్యాణ్ ప్రభుత్వానికి కేంద్రం ఉద్వాసన' శీర్షికతో వచ్చిన ఓ వార్తను ప్రదర్శించారు. 'బిజెపి తప్పుడు అంచనాలు ఘోరం' అంటూ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చేసిన వ్యాఖ్యను ఉటంకిస్తూ మరో పత్రిక పెట్టిన శీర్షికను కూడా పాత పుస్తకంలో చూపారు. కొత్త పుస్తకంలో మాత్రం అలాంటి క్లిప్పింగులేవీ కన్పించలేదు. సిబిఎస్ఇ పరిధిలోని పాఠశాలల్లో ఈ పాఠ్య పుస్తకాలను బోధిస్తారు. భారత రాజకీయాల్లో తాజా పరిణామాలకు అనుగుణంగా పాఠ్య పుస్తకంలోని అంశాలను మార్పు చేసినట్లు ఎన్‌సిఇఆర్‌టి పేర్కొంది.

అల్లర్ల గురించి పిల్లలకు ఎందుకు చెప్పాలి
ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ వితండవాదం

అల్లర్ల గురించి పిల్లలకు ఎందుకు చెప్పాలని ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ దినేష్ ప్రసాద్ సక్లానీ వితండవాదం చేసారు. పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ అంశాలను ప్రస్తావించారు. సానుకూల పౌరులను సృష్టించాలనుకుంటున్నామని, హింసాత్మక లేదా అణచివేయబడిన పౌరులను సృష్టించాలనుకోవడం లేదని, అందువల్లే అల్లర్ల గురించి బోధించడం లేదని చెప్పారు. పాఠ్య పుస్తకాలను ఏటా సవరిస్తారని, ఏది మార్చాలనేది బోధనా శాస్త్ర నిపుణులు నిర్ణయిస్తారని, తాను ఆ ప్రక్రియలో జోక్యం చేసుకోనని అన్నారు.

దేనినైనా హ్యాక్ చేయొచ్చు

- ఇవిఎంల వివాదంలో ఎలాన్ మస్క్
- భారత ఇవిఎంలు బ్లాక్ బాక్స్‌లు : రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ: భారత ఇవిఎంలు సురక్షితమైనవని, విభిన్నమైనవని బిజెపి నాయకుడు, కేంద్ర ఐటి శాఖ మాజీ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలను టెక్ దిగ్గజం, టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ ఖండించారు. దేనినైనా హ్యాక్ చేయవచ్చునని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై చంద్రశేఖర్ స్పందిస్తూ... "సాంకేతికంగా మీరు కరెక్టే. ఏదైనా సాధ్యమే. ఉదాహరణకు క్వాంటం కంప్యూటర్ ఏ స్థాయి ఎన్‌క్రిప్షన్‌ను అయినా నేను డీక్రిప్ట్ చేయగలను. జెట్ యొక్క విమాన నియంత్రణలోని గ్లాస్ కాక్‌పిట్‌తో సహా డిజిటల్ హార్డ్‌వేర్, సిస్టమ్‌ను నేను ల్యాబ్ లెవల్ టెక్, వనరులతో హ్యాక్ చేయగలను. కానీ, విభిన్నమైన కన్వర్జేషన్ ఉండటం వలన ఇవిఎంలు సురక్షితమైనవని నేను చెబుతున్నాను. మీ వాదనతో నేను విభేదిస్తున్నాను' అని మంత్రి అన్నారు.

ఇవిఎంల గురించి గత మూడు రోజులుగా సోషల్ మీడియాలో వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. ప్యూర్టో రికో ప్రైమరీ ఎన్నికల్లో ఇవిఎంలకు సంబంధించిన ఓటింగ్ అవకతవకలపై అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి రాబర్ట్ కెన్నడీ జూనియర్ చేసిన పోస్ట్‌కు స్పందిస్తూ 'ఇవిఎంలను తొలగించాలి' అని మస్క్ ఎక్స్‌లో పోస్టు చేయడంతో ఈ వివాదం ప్రారంభమైంది. 'ఇవిఎంలను మానవులు, ఎఐలు హ్యాక్ చేసే ప్రమాదం ఉంది. ఈ ప్రమాదం చిన్నదే అయినా.. ఎక్కువ ప్రభావం చూపుతుంది' అని మస్క్ ఎక్స్‌లో పోస్టు చేశారు. మస్క్ పోస్టుకు స్పందిస్తూ మస్క్ అభిప్రాయం ఇంటర్నెట్‌తో అనుసంధానం ఉన్న ఇవిఎంలు ఉపయోగించే అమెరికా, ఇతర ప్రాంతాలకు వర్తిస్తుందని మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ పోస్టు చేశారు. భారత ఇవిఎంలు సురక్షితమైనవి, విభిన్నంగా డిజైన్ చేసినవి అని చెప్పారు.

భారత ఇవిఎంలు బ్లాక్ బాక్స్‌లు : రాహుల్ గాంధీ



భారత ఇవిఎంలు 'బ్లాక్ బాక్స్' వంటివని, వీటిని ఎవరూ పరిశీలించడానికి అనుమతించరని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పారు. భారత ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'సంస్థల్లో బాధ్యతాయుత విధానం లోపించినప్పుడు ప్రజాస్వామ్యం బూటకంగా మారుతుంది. మోసంగా మారుతుంది' అని అన్నారు. ఇవిఎంల వివాదంపై భారత ఎన్నికల సంఘం ఇంకా స్పందించలేదు.

కాశ్మీర్‌లో ఉగ్రదాడులపై అమిత్ షా సమీక్ష

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో ఇటీవల ఉగ్రదాడుల ఘటనల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదివారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత వారంరోజుల వ్యవధిలోనే నాలుగు దాడి ఘటనలు జరగడం, అమర్‌నాథ్ యాత్రకు సమయం దగ్గరపడుతున్న క్రమంలో భద్రతా చర్యలపై అధికారులతో ఆయన దాదాపు ఐదుగంటల పాటు సమావేశమయ్యారు. ఉగ్రవాదులు భారత భూభాగంలోకి చొరబడేందుకు ఉపయోగిస్తున్న సొరంగాలను గుర్తించాలని.. అదే సమయంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నిఘా వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు. డ్రోన్ చొరబాట్లను సైతం సమర్థవంతంగా ఎదుర్కోవాలని చెప్పారు. సైన్యం, పారామిలిటరీ బలగాలు పరస్పర సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన స్పందించాలని షా సూచించారు. భద్రతాపరంగా అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే, కాబోయే ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా, కేంద్ర నిఘా సంస్థ డైరెక్టర్ తపన్ దేకా, సిఆర్‌పిఎఫ్ డిజి అనీశ్ దయాళ్ సింగ్, బిఎస్ఎఫ్ డిజి నితిన్ అగర్వాల్, డిజిపి ఆర్ఆర్ స్వైన్ తదితరులు హాజరయ్యారు.

జల్‌బోర్డు కార్యాలయంపై బిజెపి దాడి

- కేంద్రం జోక్యం చేసుకోవాలి : ఆప్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో





బిజెపి ఆందోళనలో ధ్వంసమైన ఢిల్లీ జల్ బోర్డు కార్యాలయం

ఢిల్లీలో నీటి సంక్షోభం తీవ్ర రూపు దాల్చింది. ఎగువన ఉన్న హర్యానా ఢిల్లీకి నీరు విడుదల చేయక పోవడంతో ఢిల్లీ వాసులు నీటి కష్టాలు పడుతున్నారు. చాలా ప్రాంతాలు నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. బిజెపి హింసాత్మక ఆందోళనతో యుద్ధాన్ని తలపించే పరిణామాలు చోటుచేసుకున్నాయి. మరోవైపు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, ప్రధాన నీటి పైప్‌లైన్లకు పోలీసులు రక్షణ కల్పించాలని ఢిల్లీ మంత్రి అతిషి కోరారు. నీటి ఎద్దడిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని ఆరోపిస్తూ ఢిల్లీ జల్ బోర్డు కార్యాలయం వద్ద బిజెపి చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారింది. పలువురు బిజెపి కార్యకర్తలు జల్ బోర్డు కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. చత్తార్‌పూర్ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో ఆ పార్టీ కార్యకర్తలు జల్ బోర్డు కార్యాలయం వద్ద నిరసనలకు దిగారు. ఈ ఘటనపై బిజెపి నేత రమేష్ బిధూరి స్పందించారు. ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంటే ఏమైనా చేయగలరని మరింత రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఇది ప్రజల, ప్రభుత్వ ఆస్తి అని, వీటిని ధ్వంసం చేయడం తగదని అన్నారు.

కేంద్రం జోక్యం చేసుకోవాలి : అతిషి

కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే ఢిల్లీలో నీటి సంక్షోభ పరిస్థితి మెరుగుపడదని ఢిల్లీ మంత్రి అతిషి ఆదివారం పేర్కొన్నారు. హర్యానాలోని తమ ప్రభుత్వంతో బిజెపి చర్చించి ఢిల్లీ ఎక్కువ నీరు పొందేలా చూడాలని అన్నారు. ఢిల్లీలో నీటి ఎద్దడి తీవ్రమవుతుండటంతో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలోని ప్రధాన పైప్‌లైన్లకు భద్రత కల్పించేందుకు పోలీస్ సిబ్బందిని నియమించాలని కోరుతూ ఆదివారం ఢిల్లీ పోలీస్ కమిషనర్ సంజయ్ అరోరాకు మంత్రి లేఖ రాశారు. సోనియా విహార్ నుండి దక్షిణ ఢిల్లీ ప్రధాన పైప్‌లైన్‌లో లీకేజీ ఏర్పడిందని అన్నారు. దక్షిణ ఢిల్లీ మొత్తం నీరు అందించే ఈ పైప్‌లైన్ లీకేజీ వెనుక కుట్ర ఉన్నట్లు ఆ లేఖలో పేర్కొన్నానని అన్నారు. అయితే ఇది ఆరోపణలు, ప్రత్యారోపణలకు, నీచరాజకీయాలకు సమయం కాదని అన్నారు. హర్యానాలోని తమ ప్రభుత్వంతో మాట్లాడి ఢిల్లీకి ఎక్కువ నీరు ఇప్పించాలని బిజెపిని అభ్యర్థిస్తున్నానని పేర్కొన్నారు. ఈ పరిస్థితిలో కేంద్రం జోక్యం చేసుకోకపోతే.. పరిస్థితి బాగుపడదని అన్నారు. తమ నీటి నిర్వహణ బృందం ఆరు గంటల పాటు శ్రమించి పైప్‌లైన్ లీకేజీని సరిచేసిందని, దీని అర్థం ఆరు గంటల పాటు నీటి సరఫరాను నిలిపివేయాల్సి వచ్చిందని చెప్పారు. దాంతో దక్షిణ ఢిల్లీలో 25 శాతం నీటి కొరత ఏర్పడిందన్నారు. ఈ సమయంలో 20 ఎంజిడి నీటిని సరఫరా చేయలేదని, ఫలితంగా దక్షిణ ఢిల్లీలో మరో 25 శాతం నీటి కొరత ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

అతిషి మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం ఢిల్లీలో తీవ్రమైన వేడిగాలులు వీస్తున్నాయని, నీటి కొరత సైతం ఉందని అన్నారు. ఈ క్రమంలో నీటి పైప్‌లైన్లను పగులగొట్టి కొరతను మరింత తీవ్రతరం చేసేందుకు కొందరు కుట్ర పన్నుతున్నారని తెలుస్తోందన్నారు. దక్షిణ ఢిల్లీలోని సరఫరా పైప్‌లైన్‌లో శనివారం భారీ లీకేజీ ఏర్పడిందని, ఈ విషయం తెలుసుకున్న తమ బృందం మరమ్మతుల కోసం ఓ టీమ్‌ను పంపగా, చాలా పెద్ద బోల్టులు కోసి ఉన్నట్లుగా గుర్తించారని అన్నారు. అనంతరం మంత్రి సౌరభ్ భరద్వాజ్ మాట్లాడుతూ.. కొద్దిరోజులు ఢిల్లీలో లీకేజీలు ఉన్నాయంటూ కొందరు నిర్దిష్ట వ్యక్తులు పలు వీడియోలను వైరల్ చేశారన్నారు. లీకేజీ సహజమని తాను అనుకోనని, కొందరు కావాలని లీకేజీలకు కారణమవుతున్నారని అన్నారు. శనివారం దక్షిణ ఢిల్లీలో పైపులు కట్టే నట్‌లు, బోల్టులు కోసి కనిపించాయన్నారు. వాటిని ఎవరో కట్ చేశారని, దాంతో దక్షిణ ఢిల్లీలో నీళ్లు లేవని అన్నారు. పైప్‌లైన్ల ధ్వంసం చేసేందుకు కొందరు కుట్ర పన్నుతున్నారని, ప్రజలు సైతం నిఘా వేసి ఉండాలని కోరారు.

అసమానతలు.. అరకొర వేతనాలు

- అసంఘటిత రంగంలో 11 కోట్ల మంది కార్మికులు
- దశాబ్దం తర్వాత తొలిసారి సమాచారాన్నిచ్చిన కేంద్రం



న్యూఢిల్లీ : అనధికారిక లేదా చట్టబద్ధంగా ఏర్పడని సంస్థల్లో అసమానతలు, చాలీచాలని అరకొర వేతనాలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. చట్టవిరుద్ధంగా పనిచేస్తున్న సంస్థల వార్షిక సర్వే (ఎఎస్‌యుఎస్ఇ) తాజా నివేదిక ప్రకారం మన దేశంలో ఆరున్నర కోట్ల అనధికారిక లేదా చట్టబద్ధంగా ఏర్పడని సంస్థలు ఉన్నాయి. వీటిలో 2022-23లో 11 కోట్ల మంది కార్మికులు పనిచేశారు. ఈ సంస్థలన్నీ కలిపి ఆ ఏడాది రూ.15.4 లక్షల కోట్ల విలువైన స్థూల విలువ ఆధారిత (జివిఎ) వస్తువులు, సేవలను ఉత్పత్తి చేశాయి. వ్యవసాయం కాకుండా అనియత రంగంలో జివిఎ, ఉపాధి వాటా వరుసగా 6%, 19%గా ఉన్నాయి. మొత్తంగా జివిఎలో వ్యవసాయానికి సంబంధించి ఉపాధి వాటా 45%, ఆదాయ వాటా 18% ఉంటుందని భావిస్తే మూడింట రెండు వంతుల మంది కార్మికులు జివిఎలో కేవలం నాలుగో వంతు మాత్రమే భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థలో తీవ్రంగా పాతుకుపోయిన అసమానతలకు అద్దం పడుతోంది.

2021-22, 2022-23 సంవత్సరాలకు సంబంధించి చట్టవిరుద్ధంగా పనిచేస్తున్న సంస్థల వార్షిక సర్వే (ఎఎస్‌యుఎస్ఇ) ఈ విషయాలను బయటపెట్టింది. జాతీయ శాంపిల్ సర్వే సంస్థ దీనిని నిర్వహించింది. స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) సంఖ్యలు సహా అనేక గణాంకాలను తాజా పరిచేందుకు ఈ సర్వే దోహదపడుతుంది. పూర్తిస్థాయి నివేదిక ఇంకా బహిర్గతం కానప్పటికీ ఇవి ప్రాథమికంగా తెలిసిన వివరాలు.

2022 జూన్ - 2023 జూన్ మధ్యకాలంలో నిర్వహించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం 2022-23లో దేశంలో 56.7 కోట్ల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో చట్టబద్ధం కాని సంస్థల్లో పనిచేసిన వారు 11 కోట్ల మంది... అంటే 20శాతం మంది మాత్రమేనని తాజా గణాంకాలు చెబుతున్నాయి. వ్యవసాయం, నిర్మాణం మినహా చటబద్ధంగా ఏర్పడని మిగిలిన రంగాల్లో అసమానతలు, చాలీచాలని అరకొర వేతనాలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయని కూడా తాజా నివేదిక నొక్కి చెప్పింది. ఈ రెండు రంగాలు దేశ ఆర్థిక వ్యవస్థలో తక్కువ ఆదాయాన్ని అందించే ఉపాధిని కల్పిస్తున్నాయి. తాజా నివేదిక నిర్మాణ రంగాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఉత్పత్తి, వాణిజ్యం, ఇతర సేవల రంగాలను మాత్రమే గమనంలోకి తీసుకుంది.

అసంఘటిత రంగానికి సంబంధించిన సమాచారం దశాబ్ద కాలానికి పైగా అందుబాటులో లేదు. దీంతో ఆ ప్రభావం జిడిపి సంఖ్యలతో మొదలుకొని అన్ని ఆర్థిక వ్యవస్థల సమాచారానికి సంబంధించిన విశ్వసనీయతపై పడిందని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న హిమాన్షు తెలిపారు. ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా రంగాల వారీగా పారదర్శకంగా పూర్తిస్థాయి నివేదికను విడుదల చేయాలని, అందరి అభిప్రాయాలను విస్తృత స్థాయిలో వినాలని కోరారు. ఆ తర్వాతే ఇతర గణాంకాల సమాచారాన్ని నవీకరించాలని సూచించారు. అప్పుడే భారత గణాంక వ్యవస్థ విశ్వసనీయత పునరుద్ధరించబడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.



నిరాశ్రయులైన పాలస్తీనా పిల్లలపైనా దాడులు


- ఇజ్రాయిల్ దాష్టీకాలపై యునిసెఫ్ ఆందోళన

న్యూయార్క్: నిరాశ్రయులైన పాలస్తీనా పిల్లలపై చాలా ప్రాంతాల్లో బాంబు దాడులు జరుగుతుండడం పట్ల యునిసెఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచవ్యాపితంగా పిల్లలకు మానవతా అభివృద్ధి సాయాన్ని అందజేసే ఈ ఐక్యరాజ్యసమితి సంస్థ గాజాలో పిల్లలు ఎదుర్కొంటున్న భయానక పరిస్థితిని స్వయంగా పరిశీలించింది. ఇజ్రాయిల్ చేస్తున్న బాంబు దాడుల వల్ల అక్కడి పిల్లలు నరకం అనుభవిస్తున్నారని యునిసెఫ్ ప్రతినిధి జేమ్స్ ఎల్డర్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఒకదానిని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

ఈద్ ఉల్ అజా సందర్భంగా పిల్లలు ఆకలితో అలమటించడం చాలా బాధాకరమని ఆయన అన్నారు. దక్షిణ గాజాలో పిల్లలకు ఆహార బాక్స్‌లను గుర్తు తెలియని విమానం ద్వారా శనివారం జారవిడిచారు. బక్రీద్ పండగ ముందు రోజు అల్ మవాసి ఏరియా, ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో జారవిడిచిన ఆహార బాక్స్‌ల కోసం జనం పరుగులు తీశారు.

స్విస్ సదస్సు తీర్మానంపై సంతకానికి

12 దేశాలు తిరస్కృతి



ఓబుర్జెన్ (స్విట్జర్లాండ్): ఉక్రెయిన్ యుద్ధంపై పశ్చిమ దేశాల ఆధ్వర్యంలో జరిగిన స్విస్ శాంతి సదస్సు రూపొందించిన తుది ప్రకటనపై సంతకాలు చేయడానికి ఓ డజను దేశాలు తిరస్కరించాయి. ఈ సదస్సుకు 180 దేశాలను ఆహ్వానించగా 92 దేశాలు, 8 అంతర్జాతీయ సంస్థలు హాజరయ్యాయి. సదస్సుకు ఆహ్వానించనందున రష్యా హాజరుకాలేదు. ఒక వేళ పిలిచినా వెళ్లేది కాదు. ఎందుకంటే ఈ సదస్సు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ డిమాండ్లు నెరవేర్చడమే ధ్యేయంగా ఏర్పాటు చేయబడింది. రష్యా లేకుండా ఉక్రెయిన్‌లో శాంతి గురించి మాట్లాడడం అర్థం లేదన్న అభిప్రాయంతో చైనా కూడా హాజరు కాలేదు.రష్యా, చైనా లేకుండా ఈ సదస్సు చేసే తీర్మానానికి విలువేముంటుందని ఆర్మేనియా, బ్రెజిల్, ఇండియా, సౌదీ అరేబియా, సౌతాఫ్రికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో సహా పన్నెండు దేశాలు దానికిపై సంతకానికి తిరస్కరించాయని ఆర్ఐఎ నొవొస్తి వార్తా సంస్థ తెలిపింది. డిక్లరేషన్‌కు 79 దేశాలు ఆమోదం తెలిపాయి. వీటిలో హంగరి, సెర్బియా, టర్కీ, జార్జియా వంటి దేశాలతో బాటు నాలుగు అంతర్జాతీయ సంస్థలు ఉన్నాయి. తుది ప్రకటన ఇంకా బయటకు రానప్పటికీ, ఉక్రెయిన్ యుద్ధం వల్ల పెద్దయెత్తున మానవాళి ఇబ్బందులెదుర్కొంటున్నారని, ఆస్తుల నాశనమవుతున్నాయని, దీని ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పడుతోందని ఆ డిక్లరేషన్‌లో పేర్కొన్నట్లు నొవొస్తి వార్తా సంస్థ తెలిపింది. యుద్ధ ఖైదీల మార్పిడి పూర్తి స్థాయిలో జరగాలని, అంతర్జాతీయంగా గుర్తించిన ఉక్రెయిన్ ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించాలని ఆ ప్రకటన పిలుపునిచ్చింది. ఈ సమస్యకు అర్థవంతమైన పరిష్కారం కుదరాలంటే రష్యాను కూడా విశ్వాసంలోకి తీసుకోవాలని సౌదీ అరేబియా ఇంతకుముందే వ్యాఖ్యానించింది. కొన్ని పదాలపై అభ్యంతరాలతోనే ఈ దేశాలు సంతకం చేయలేదని ఆస్ట్రియా చాన్సలర్ కార్ల్ నెహమార్ అన్నారు. .

ఫాసిస్టు శక్తులపై

పిడికిలెత్తిన ఫ్రెంచ్ ప్రజానీకం

- పారిస్‌లో రెండున్నర లక్షలమందితో కవాతు
- దేశవ్యాపితంగా 182 చోట్ల ర్యాలీలు
- 6లక్షల మందికిపైగా హాజరు
- ఏకతాటిపై నిలిచిన వామ పక్ష పార్టీలు, కార్మిక సంఘాలు, పౌర సమాజం

పారిస్: ఫ్రాన్స్ రిపబ్లిక్‌కే సవాల్‌గా మారిన పచ్చి మితవాద, జాత్యహంకార శక్తులకు వ్యతిరేకంగా ప్రజలు పెద్దయెత్తున ఉద్యమించారు. రాజధాని పారిస్‌తో సహా దేశ వ్యాపితంగా శనివారం జరిగిన ర్యాలీల్లో 6,40,000 మంది పాల్గొన్నారు. ఒక్క పారిస్‌లోనే రెండున్నర లక్షల మంది పాల్గొనడం విశేషం. సిజిటి, సిఎఫ్‌డిటి, యుఎన్ఎస్ఎ, ఎఫ్ఎస్‌యు, యుఎన్ఇఎఫ్ వంటి ప్రధాన కార్మిక సంఘాలు, ఎస్ఒఎస్, ఎల్‌డిహెచ్ వంటి అసోసియేషన్లు ఇచ్చిన పిలుపునకు అన్ని సెక్షన్ల ప్రజానీకం నుంచి అద్భుతమైన స్పందన లభించింది. పిల్లలు, పెద్దలు, యువకులు, కుటుంబాలకు కుటుంబాలే కదలి వచ్చాయి. వర్షం, దుమ్ము ధూళి వంటి అననుకూల వాతావరణాన్ని సైతం లెక్క చేయకుండా పెద్ద యెత్తున జనం తరలిరావడం వారిలో చైతన్యానికి దర్పణం పడుతోంది. ర్యాలీలు చాలా వరకు శాంతియుతంగానే జరిగాయి. కొన్ని చోట్ల దుండగుల గుంపు అల్లర్లు సృష్టించడానికి యత్నించినప్పుడు ఘర్షణలు, అరెస్టులు చోటుచేసుకున్నాయి. రెండోరోజు ఆదివారం కూడా ప్రదర్శనలు కొనసాగాయి. పారిస్‌లో జరిగిన ర్యాలీలో పాల్గొనేందుకు తాను 600 కిలోమీటర్ల దూరం ప్రయాణించి వచ్చానని బెల్‌ఫోర్డ్‌కు చెందిన ఫరీద్ అనే డ్రైవర్ చెప్పాడు. న్యూ పాపులర్ ఫ్రంట్ గెలవాలంటే మనమందరం కలసి ఉండాల్సిన అవసరముందని ఆ డ్రైవర్ అభిప్రాయ పడ్డాడు. ఈ నిరసనలకు వామపక్ష పార్టీలు, సోషలిస్టులు పౌర సమాజం వీరికి పూర్తి మద్దతు ప్రకటించాయి. ఈనెల 30, వచ్చే నెల 7న రెండు విడతలుగా జరిగే ఫ్రాన్స్ పార్లమెంటు ఎన్నికల్లో మేరీ లీపెన్స్ నేతృత్వంలోని నేషనల్ ర్యాలీ, రీకాంక్వెస్ట్ వంటి జాతి దురహంకార, పచ్చి మితవాద పార్టీలు విజయం సాధించే అవకాశముందని కొన్ని సర్వేలు సంకేతాలిస్తున్న నేపథ్యంలో ప్రజలు వెల్లువలా వచ్చి ఈ నిరసన ర్యాలీల్లో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. "భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ మేమందరం ఏకతాటిపైకి రావడం మేము సాధించిన మొదటి విజయమని" ఎస్ఒఎస్ రెసిసమ్ కార్యకర్త, అయిదో సంవత్సర లా విద్యార్థి ప్రియయనవాల్టి పేర్కొన్నారు. ఆక్స్‌ఫామ్ ఫ్రాన్స్ అనే ఎన్‌జివో సంస్థ జనరల్ డైరెక్టర్ సెసిల్ డప్లో మాట్లాడుతూ, "ప్రమాదం చాలా పెద్దది. మితవాదులకు వ్యతిరేకంగా వామపక్ష శక్తులు శాయశక్తులా పోరాడాల్సిన అవసరముంది" అని అన్నారు. వామపక్షాలు, సోషలిస్టులు, అందరూ కలసి ఈసారి న్యూ పాపులర్ ఫ్రంట్ పేరుతో ఒక కూటమిగా ఏర్పడ్డారు. గత వారం జరిగిన ఇయు పార్లమెంటు ఎన్నికల్లో పచ్చి మితవాది మేరీ లీపెన్ పార్టీ 30శాతం ఓట్లు తెచ్చుకుని బలమైన శక్తిగా అవతరించింది. మాక్రాన్ నేతృత్వంలోని రినైజాన్స్ పార్టీ కన్నా రెండు రెట్లు అధికంగా ఓట్లు పెంచుకుంది. ఇప్పుడు పార్లమెంటు ఎన్నికల్లో గనక మితవాదులు గెలిస్తే రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఫ్రాన్స్‌లో అధికారం చేజిక్కించుకున్న తొలి పచ్చి మితవాద ప్రభుత్వంగా అది రికార్డుకెక్కుతుంది. ఇప్పటికే దేశంలో జాతి విద్వేషాలను రెచ్చగొడుతూ, రిపబ్లిక్ మౌలిక స్ఫూర్తినే దెబ్బతీసేలా మితవాద పార్టీలు వ్యవహరిస్తున్నాయి.

బడులు తెరుచుకొన్న వేళ...



రంగురంగుల యూనిఫామ్స్‌లో
సీతాకోక చిలుకల్లాంటి పిల్లల దర్శనాలు
రోడ్లపై స్కూలు బస్సుల రాకపోకలు
తెరుచుకున్న బడులకు సంకేతాలు


వేసవి సెలవుల అనంతరం మోగే బడిగంట
బడి పిల్లలకు కొత్తగా పలికే స్వాగతం
బడుల్లో పైతరగతిలో ప్రవేశం
పిల్లలకు ఉత్తీర్ణతతో దక్కే ఆనందం

కొత్త ఉపాధ్యాయులు, కొత్త స్నేహితులతో
బెరుకు బెరుకుగా మొదలయ్యే
పిల్లల తొలినాళ్ళ పరిచయాలు
అనతికాలంలో అయ్యే సత్సంబంధాలు

విద్యాలయాలు బాలలకు దేవాలయాలు
చదువుసంధ్యలు, ఆటపాటలు నేర్పే
నిలయాలు
విజ్ఞానాన్ని బోధించే గురుకులాలు
పిల్లలను తీర్చిదిద్దే శిక్షణాలయాలు


– పి.వి.ప్రసాద్,
94401 76824

లెక్కచేయండి



పిల్లలూ, కింద ఇచ్చిన బొమ్మలను అంకెలుగా గణించి లెక్క చేయండి. చూద్దాం.

నేను గీసిన బొమ్మ



కె.భువనేశ్వర్,
8వ తరగతి,
జక్కాపూర్, సిద్దిపేట జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చాక్లెట్ల వల్ల లాభాలూ నష్టాలూ...

పిల్లలు స్కూలుకు బయల్దేరుతున్నారు కదా! ఇప్పుడే తల్లిదండ్రులకు పెద్ద సమస్య తయారవుతుంది. 'పేచీ పెట్టకుండా స్కూలుకు వెళితే నీకు సాయంత్రం చాక్లెట్ కొనిపెడతా' అని చాలామంది తల్లిదండ్రులు, మారం చేసే పిల్లలను స్కూలుకు పంపించేందుకు తాయిలాలు ప్రకటిస్తారు. ఎందుకంటే చాలా మంది చిన్న పిల్లలకు చాక్లెట్లు, ఐస్ క్రీంలు అంటే చాలా ఇష్టం. అయితే ఐస్ క్రీం వల్ల జలుబు చేస్తుందని చాక్లెట్లు ఇవ్వడానికే ఎక్కువ మంది మొగ్గుచూపుతారు. పైగా చాక్లెట్లు తినడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందని, ముఖం కాంతివంతంగా తయారవుతుందని నమ్మే పెద్దలూ ఉన్నారు. అయితే చాలామంది తల్లిదండ్రులకు చాక్లెట్లు పిల్లల ఆరోగ్యానికి మంచివా కాదా అనేది మాత్రం తెలియదు.



చాక్లెట్లు తినడం వల్ల కలిగే లాభాలు

- నీరసంగా ఉన్నప్పుడు చాక్లెట్లు తినడం వల్ల కాస్త ఎనర్జీ వస్తుంది. అలాగే చాక్లెట్లలో కొన్ని విటమిన్లు ఉంటాయి. ముఖ్యంగా డార్క్ చాక్లెట్లు జ్ఞాపకశక్తిని పెంచడంతో పాటు ముఖం కాంతివంతంగా మారేందుకు సహాయపడుతుంది.
- చాక్లెట్ల ఉత్పత్తికి వాడే కోకోపౌడర్‌లో కొన్ని ఫ్లేవనాయిడ్లు ఉంటాయి. ఇన్‌ఫ్లమేషన్‌ను నివారించడం, యాంటీ ఆక్సిడెంట్లను పెంచడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. ఇన్సులిన్ సెన్సివిటీని పెంచి మధుమేహం వచ్చే అవకాశాలను తగ్గిస్తుంది.
- డార్క్ చాక్లెట్లలో సెలీనియం, జింక్, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ ఇంకా అనేక ఇతర ఖనిజాలు ఉంటాయి. ఇవి పిల్లల ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

చాక్లెట్ల వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్

- చాక్లెట్లులో ఉండే కెఫిన్ పదార్థం చిన్న పిల్లలో నిద్రలేమి సమస్యకు కారణం అవుతుంది. ఎక్కువగా చాక్లెట్లు తింటే రాత్రంతా పిల్లలు పడుకోరు.
- చాక్లెట్లను ఎక్కువ మోతాదులో ఇస్తే మాత్రం పిల్లల ఆరోగ్యం కచ్చితంగా దెబ్బతింటుంది. పిల్లల్లో అలెర్జీ ఉంటే చాక్లెట్లను ఇవ్వకపోవడమే మంచిది. చాక్లెట్లలో పాలు, గింజలు, ఇతర పదార్థాలు కూడా కలుపుతుంటారు. ఇలాంటి వాటి వల్ల అలెర్జీ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- చాక్లెట్లలో ఉండే కెఫిన్ తరచుగా పిల్లలు టాయిలెట్‌కు వెళ్లేలా చేస్తుంది. ఎక్కువగా తింటే తరచుగా వాళ్ళ ప్యాంటు తడిపేసే ఛాన్స్ ఉంది.
- ఇందులో ఉండే కోకో బటర్, ఇతర పదార్థాలు ఊబకాయం పెరిగే లక్షణాలను కలిగిఉంటాయి. కాబట్టి వీటిని ఎక్కువగా తీసుకునే పిల్లలు త్వరగా ఊబకాయానికి గురవుతారు.

పుదీనాతో పుట్టెడు ఉపయోగాలు



పుదీనాని సువాసన కోసమే కాక, ఆరోగ్యపరంగా కూడా ఉపయోగిస్తారు. ఇది చర్మ, కేశ సంబంధిత సమస్యలను కూడా పరిష్కరిస్తుంది. ఈ ఆకులను మాయిశ్చరైజర్లు, క్లెన్సర్లు, లిప్‌బామ్, షాంపు, కండిషనర్ల తయారీలో వాడతారు. పుదీనాలో అనాల్జేసిక్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీమైక్రోబియాల్, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు మెండుగా ఉంటాయి.

బ్లాక్ హెడ్స్ : పుదీనా బ్లాక్‌హెడ్స్‌ను శుభ్రంగా తొలగిస్తుంది. కొన్ని ఆకులకు చిటికెడు పసుపు కలిపి ముద్ద చేయాలి. దీనిని ముఖానికి రాసుకొని, చేతి వేళ్లతో కాసేపు మృదువుగా మర్దన చేయాలి. తర్వాత శుభ్రమైన నీటితో కడిగేయాలి. వారానికి రెండుసార్లు ఇలా చేస్తూ వుంటే బ్లాక్‌హెడ్స్ తగ్గి ముఖం కాంతివంతంగా కనిపిస్తుంది.

మొటిమలు, మచ్చలు : పుదీనా ఆకుల్లోని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు మొటిమలను కలిగించే కణాలను తొలగిస్తాయి. చర్మంపై నల్లని మచ్చలు, ఇతర మరకలను తగ్గిస్తాయి. కొన్ని పుదీనా ఆకులను నలిపి మొటిమలపై రాయాలి. క్రమం తప్పకుండా ఇలా చేస్తే కొద్దిరోజుల్లో మొటిమలు, మచ్చలు పూర్తిగా తొలగిపోతాయి.

మేనిఛాయ : ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు, ఇతర గుణాల వల్ల మృతకణాలు తొలగిపోతాయి. ఇవి బాక్టీరియాను చంపి చర్మాన్ని మృదువుగా, ఆరోగ్యవంతంగా చేస్తాయి. కొన్ని పుదీనా ఆకులకు చిటికెడు పసుపు, కొన్ని చుక్కలు రోజ్ వాటర్ కలిపి ముద్ద చేయాలి. దీనిని ముఖం, మెడకు రాసుకుని 15 నిమిషాల తర్వాత కడిగేయాలి.

ముడతలు : పుదీనా ముఖంపై నుండి ఫ్రీరాడికల్స్‌ను తొలగిస్తుంది. వయసు రీత్యా వచ్చే ముడతల నుంచి సంరక్షిస్తుంది. పుదీనా ఆకులను నీళ్లలో మరిగించి, చల్లార్చాలి. ఈ నీటిని ముఖానికి రాసుకోవాలి.

దురద : కాలిన గాయాలు, ఎలర్జీలకు ఇది మంచి నివారణ. పుదీనా ఎలర్జీ కలిగించే బాక్టీరియాను చంపుతుంది. ఆకులను మెత్తగా నూరి ప్రభావిత ప్రాంతంపై రాసుకోవడం ఈ సమస్యకు అత్యుత్తమ పరిష్కారం.

జుట్టు రాలడం : యాంటీఆక్సిడెంట్ గుణాలు మెండుగా ఉండే పుదీనా ఆకులు జుట్టు రాలడాన్ని అరికట్టడమే కాకుండా, ఎదుగుదలకు తోడ్పడతాయి. పుదీనా ఆకులను మరిగించిన నీటిని జుట్టు, మాడుకు బాగా మర్దన చేసుకోవాలి. పది నిమిషాల తరువాత మామూలు నీటితో కడిగేయాలి. ఇలా చేయడం వల్ల మాడుపై ఇన్ఫెక్షన్లూ తగ్గుతాయి. ఇది జుట్టుకు మంచి కండిషనర్‌లా పనిచేస్తుంది. వారానికి రెండుసార్లు ఇలా చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

లిచీతో ఆరోగ్యం



ఇప్పుడు మార్కెట్లో ఎక్కడ చూసినా లిచీ పండ్లు కనిపిస్తున్నాయి. చూడటానికి ఆకర్షణీయంగా ఉన్న ఈ పండ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ముఖ్యంగా ఈ సీజన్లో వచ్చే వ్యాధుల నుంచి బయటపడేందుకు సహాయపడతాయి.

- రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. చర్మ రక్షణకు దోహదపడతాయి. ఈ పండ్లతో జ్యూస్‌లు, జెల్లీలు, శీతల పానీయాలను కూడా తయారు చేసుకోవచ్చు.
- లిచీ పండ్లలో విటమిన్ సి, విటమిన్ డి, మెగ్నీషియం, రైబో ఫ్లేవిన్, కాపర్ వంటి పోషకాలు ఉంటాయి.
- వీటిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. బరువు తగ్గాలని అనుకొనేవారికి ఇవి చాలా మంచివి.
- ఈ పండ్లలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది.
- చర్మ ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది.
- వృద్ధాప్య చాయలు రాకుండా అడ్డుకుంటుంది..
- పోటాషియం అధికంగా ఉండటం వల్ల జీర్ణ సమస్యలు తగ్గుతాయి. మలబద్ధకం తగ్గుతుంది. జీర్ణశక్తి పెరుగుతుంది.

ఆంధ్రాలో సినీ పరిశ్రమ విస్తరించేనా?

రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు గడిచిపోయాయి. రాష్ట్ర విభజన సమయంలో చాలామంది సినిమా పెద్దలు, సినీ పరిశ్రమతో సంబంధం ఉన్న నాయకులూ ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధి గురించి మాట్లాడారు. కానీ, ఈ పదేళ్ల కాలంలో పెద్దగా ఏమీ జరగలేదు. ఇప్పుడు సినీరంగానికి చెందిన పవన్ కళ్యాణ్, బాలకృష్ణ భాగస్వాములుగా ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడింది. జనసేనకు చెందిన కందుల దుర్గేశ్ సినిమాటోగ్రఫీ మంత్రిగా నియమితులైన నేపథ్యంలో మళ్లీ ఆంధ్రాలో చిత్ర పరిశ్రమ అభివృద్ధిపై చర్చ మొదలైంది.



మద్రాస్ (చెన్నై) కేంద్రంగా దక్షిణ భారత చలన చిత్ర రంగం విలసిల్లినప్పుడు తెలుగు సినిమా రంగం కూడా అక్కడ మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలిగింది. అనేకమంది అక్కడ సొంత స్టూడియోలు, థియేటర్లు, రికార్డింగ్ థియేటర్లు నిర్మించారు. ఆంధ్ర రాష్ట్రం మద్రాస్ నుంచి విడిపోయి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైన తర్వాత కూడా రెండు దశాబ్దాలపాటు మద్రాస్‌లోనే ఉండిపోయిన తెలుగు సినిమా అక్కడి నుంచి అనేక సవాళ్ల మధ్య హైదరాబాద్‌కు మారింది. అప్పట్లోని ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహకాలు కూడా తోడయ్యాయి. అప్పట్లో స్టూడియోలకు స్థలం కేటాయించడం, ఇళ్ల కట్టుకోవడానికి దాదాపు 100 ఎకరాల భూమిని అతి తక్కువ ధరకు ప్రస్తుత ఫిల్మ్ నగర్‌లో కేటాయించడం వల్ల హైదరాబాద్‌లో చలన చిత్ర పరిశ్రమ నిలదొక్కుకునేందుకు దోహదం చేసింది. ఆంధ్రప్రదేశ్ కాస్తా తెలంగాణా, ఆంధ్రాగా విడిపోవటంతో మళ్లీ పరిశ్రమ విస్తరణపై చర్చ మొదలైంది. విశాఖపట్నం, తిరుపతి కేంద్రాలుగా సినిమా పరిశ్రమ ఆంధ్రాలోనూ విస్తరించాలనే ఆకాంక్ష వ్యక్తమైంది. విస్తారమైన సాగరతీరం, అడవులు, కృష్ణా గోదావరి నదులు, ప్రకృతి అందాలూ ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ఏడెనిమిది దశాబ్దాలుగా షూటింగులు జరుగుతూనే ఉన్నాయి. అన్ని రకాల నేపథ్యాలకు అనువైన ప్రదేశాలు ఇక్కడ ఉన్నాయి.

పదేళ్లయినా పరిశ్రమ ఎక్కడ?

హైదరాబాద్‌లో పరిశ్రమ నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం చేసిన సహకారం ఇంతవరకు రాష్ట్రంలో కనిపించటం లేదు. ఉమ్మడి రాష్ట్రంగా ఉనప్పుడే విశాఖలో రామానాయుడు స్టూడియోస్ నిర్మించారు. అయినా, అక్కడ షూటింగులు, నిర్మాణ పనులూ జరిగింది తక్కువ. ఆంధ్రలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి విశాఖ, విజయవాడ, తిరుపతి ప్రాంతీయ కేంద్రాలుగా సినిమా స్టూడియోలు ఏర్పాటు కావాల్సివుంది. స్థానికంగా సినిమా నిర్మాణం చేసేవారికి తగిన రాయితీలు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఆ దిశగా కృషి కొనసాగటం లేదు. అడపా దడపా సినిమా షూటింగ్‌లు అరకు, పాడేరు, విజయవాడ ప్రకాశం బ్యారేజీ, హార్స్‌లీ హిల్స్, బైరవ కోన వంటి ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. ఇన్ఫ్రాస్ట్రక్చర్ యూనిట్లు సరిగాలేక నిర్మాతలు ఇబ్బంది పడుతున్నారు. తెలంగాణాలో ఇండోర్, అవుట్‌డోర్ యూనిట్లు ఉన్నాయి. ఆంధ్రాలో అవి లేవు. విశాఖలో ఒక్క స్టూడియో మాత్రమే ఉండటంతో తిరుపతికి అవుట్‌డోర్ వెళ్లే వారు అక్కడి నుంచి టెక్నాలజీ మొత్తం తీసుకెళ్లటం ఇబ్బందికరంగా మారింది.



మౌలిక వసతులు కరువు

చిత్రీకరణ జరిగే ప్రదేశాల్లో మౌలిక వసతులు కూడా తక్కువగా ఉన్నాయనే అసంతృప్తి సినీబృందాల్లో ఉంది. విశాఖ, తిరుపతి, అరకు వంటి ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ అతిథి గృహాలను నామమాత్రం రుసుంతో కేటాయిస్తే పరిశ్రమ అభివృద్ధికి ప్రోత్సాహం ఇచ్చినట్టవుతుందని చిన్న నిర్మాతలు అంటున్నారు. కేరళ రాష్ట్రం మాదిరిగా ఎపి ప్రభుత్వం కూడా ఇండోర్, అవుట్‌డోర్ యూనిట్లు ఏర్పాటు చేసి షూటింగ్‌లకు ఇస్తే పరిశ్రమ అభివృద్ధికి దోహదపడుతుంది. కొందరికి ఉపాధి అవకాశాలు కల్పించిన వారవుతారు. టెక్నాలజీతోపాటుగా నైపుణ్యమైన వారు కూడా ఉండాలి. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా నైపుణ్యం కల్గిన వారిని తయారుచేయొచ్చు. ఎనిమిదేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో చిన్న సినిమాలకు రూ.10 లక్షల సబ్సిడీ ఇస్తూ అప్పటి ప్రభుత్వం జీవోను జారీచేసింది. అయితే నేటికీ ఏ ఒక్క నిర్మాతకు సబ్సిడీ రాలేదు. కారణం నిబంధనలు కష్టంగా ఉండటం. కర్ణాటక మాదిరిగా సబ్సిడీ రూల్స్ సడలిస్తే బాగుంటుందని చిన్న నిర్మాతలు కోరుతున్నారు.

నంది అవార్డుల సంగతేంటీ?

నంది అవార్డులు ప్రకటించి సుమారు ఎనిమిదేళ్లు గడిచింది. అప్పట్లో వచ్చిన ఏదో చిన్న సమస్యను బూచీగా చూపించి అవార్డుల ప్రకటన ఆపేశారు. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావటంతో తిరిగి అవార్డులను ప్రకటిస్తారనే ఆశాభావం పరిశ్రమలో కన్పిస్తోంది. ఈ అవార్డులు ప్రకటించటం ద్వారా ఇండస్ట్రీలో హీరోహీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులు, 24 విభాగాల్లో ఉన్న సాంకేతిక నిపుణులకు తమ ప్రతిభను నిరూపించుకోవటానికి అవకాశం ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉన్నా పరిశ్రమకు అనుకున్నంత మేలు జరగటం లేదు. హైదరాబాద్ కేంద్రంగానే సినిమా పరిశ్రమ కొనసాగుతోంది. తెలుగు సినిమా రెండు రాష్ట్రాల్లో కాక దేశవ్యాప్తంగా వ్యాపార పరిధిని విస్తరించుకుందనటంలో ఎలాంటి సందేహం లేదు. ఈ క్రమంలో ఆంధ్రాలో కూడా పరిశ్రమ విస్తరిస్తే రాష్ట్రప్రభుత్వానికి ఆదాయం పెరగటమే కాకుండా స్థానికులకు కొంతమేరకైనా ఉపాధి అవకాశాలు వచ్చే అవకాశం ఉంటుంది.

సూపర్8కు ఇంగ్లాండ్

- **నమీబియాపై 41 పరుగులతో గెలుపు**
- **వరుణుడు భయపెట్టినా గట్టెక్కిన ఇంగ్లాండ్**

నార్త్‌సౌండ్ : గ్రూప్ దశలో వరుణుడి ఆటతోనే సూపర్8 సమీకరణాలు మారిపోగా.. కీలక చివరి మ్యాచ్‌లోనూ వరుణుడు అదే పని చేసేలా కనిపించాడు. గ్రూప్–బిలో నమీబియా, ఇంగ్లాండ్ మ్యాచ్‌తో వరుణుడు ఓ ఆట ఆడుకున్నాడు. సూపర్8కు చేరేందుకు తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో ఆట సాధ్యం కాకపోతే డిఫెండింగ్ చాంపియన్ ఇంటి బాట పట్టాల్సిన దుస్థితి. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఆట మొదలైనా.. మళ్లీ వర్షంతో అడ్డంకులు.. మళ్లీ సవరించిన ఓవర్లతో ఇలా సాగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ పైచేయి సాధించింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో నమీబియాపై 41 పరుగులతో భారీ విజయం నమోదు చేసింది. గ్రూప్–బి నుంచి సూపర్8కు చేరుకున్న రెండో జట్టుగా నిలిచింది.



తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 10 ఓవర్లలో 122/5 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ సాగుతుండగా వర్షం అంతరాయంతో 11 ఓవర్ల మ్యాచ్‌ను 10 ఓవర్లకు కుదించారు. ఫిల్ సాల్ట్ (11), జోశ్ బట్లర్ (0) నిరాశపరచగా ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ నెమ్మదిగా మొదలైంది. జానీ బెయిర్‌స్టో (31, 18 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), హ్యారీ బ్రూక్ (47 నాటౌట్, 20 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఇంగ్లాండ్‌కు భారీ స్కోరు అందించారు. మోయిన్ అలీ (16), లియాం లివింగ్‌స్టోన్ (13) ధనాధన్ ఇన్నింగ్స్‌లు ఆడారు. బ్రూక్ అజేయ ఇన్నింగ్స్‌తో ఇంగాండ్‌కు గెలుపు స్కోరు సాధించాడు. ఛేదనలో నమీబియా లక్ష్యాన్ని డక్‌వర్త్ పద్ధతిలో 10 ఓవర్లకు 126 పరుగులుగా సవరించారు. 10 ఓవర్లలో నమీబియా 3 వికెట్లకు 84 పరుగులే చేసింది. మైకల్ వాన్ (33), నికోలస్ (18), డెవిడ్ వైసీ (27) ఆకట్టుకున్నారు. హ్యారీ బ్రూక్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

స్టోయినిస్ మెరవగా..!



స్కాట్లాంగ్రాస్‌ఐలెట్ : అగ్రజట్టు ఆస్ట్రేలియాను పసికూన స్కాట్లాండ్ భయపెట్టింది. 181 పరుగుల ఛేదనలో ఆస్ట్రేలియా ఓ దశలో 60/3తో కష్టాల్లో కూరుకుంది. ఓపెనర్ ట్రావిశ్ హెడ్ (68, 49 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), మార్కస్ స్టోయినిస్ (59, 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో ఆసీస్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 19.4 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. డెవిడ్ వార్నర్ (1), మిచెల్ మార్ష్ (8), గ్లెన్ మాక్స్‌వెల్ (11) విఫలమయ్యారు. ఓపెనర్ ట్రావిశ్ హెడ్ ఓ ఎండ్‌లో దంచికొట్టగా.. ఆఖర్లో మార్కస్ స్టోయినిస్ మెరిశాడు. టిమ్ డెవిడ్ (24 నాటౌట్), మాథ్యూ వేడ్ (4 నాటౌట్) లాంఛనం ముగించారు. తొలుత బ్యాటింగ్ చేసిన స్కాటాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 180 పరుగులు చేసింది. బ్రాండన్ మెక్‌ములన్ (60, 34 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లు) అర్థ సెంచరీతో కదంతొక్కగా.. జార్జ్ మున్సె (35), రిచీ బెరింగ్టన్ (42 నాటౌట్) రాణించారు. మార్కస్ స్టోయినిస్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. గ్రూప్–బి నుంచి ఆస్ట్రేలియా అగ్రస్థానంతో సూపర్8కు చేరుకుంది.



శతక మంధాన

- **దక్షిణాఫ్రికాపై భారత్ ఘన విజయం**
- **రాణించిన ఆశా శోభన, దీప్తి శర్మ**
- **సఫారీ, భారత మహిళల తొలి వన్డే**

బెంగళూరు : దక్షిణాఫ్రికా, భారత మహిళల తొలి వన్డేలో టీమ్ ఇండియా ఘన విజయం సాధించింది. సఫారీ అమ్మాయిలపై 143 పరుగుల తేడాతో ఏకపక్ష విజయం నమోదు చేసింది. స్మృతీ మంధాన (117, 127 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్) శతక గర్జన చేసింది. 12 ఫోర్లు, ఓ సిక్సర్‌తో చెలరేగిన మంధాన దక్షిణాఫ్రికా బౌలర్లను ఉతికారేసింది. దీప్తి శర్మ (37, 48 బంతుల్లో 3 ఫోర్లు), పూజ వస్త్రాకర్ (31, 42 బంతుల్లో 3 ఫోర్లు) లోయర్ ఆర్డర్‌లో కీలక ఇన్నింగ్స్‌లు నమోదు చేశారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 265 పరుగులు చేసింది. యువ ఓపెనర్ షెఫాలీ వర్మ (7), హేమలత (12) సహా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (10), జెమీమా రొడ్రిగస్ (17), రిచా ఘోష్ (3) విఫలమయ్యారు. ఓ ఎండ్‌లో నిలబడిన స్మృతీ మంధాన ఇన్నింగ్స్‌కు ముందుకు నడిపించింది. మంధాన లోయర్ ఆర్డర్‌లో దీప్తి శర్మ, పూజ వస్త్రాకర్‌లు చక్కటి సహకారం అందించారు. సఫారీ బౌలర్లలో ఆయబోంగ (3/47), క్లాస్ (2/51) రాణించారు. ఇక భారీ ఛేదనలో దక్షిణాఫ్రికా అమ్మాయిలు చేతులెత్తేశారు. లెగ్ స్పిన్నర్ ఆశా శోభన (4/21) మాయజాలానికి దీప్తి శర్మ (2/10) సైతం తోడైంది. దీంతో 37.4 ఓవర్లలో 122 పరుగులకే దక్షిణాఫ్రికా ఆలౌటైంది. సఫారీ బ్యాటర్లలో సునె లస్ (33), మారిజానె కాప్ (24), జాఫ్టా (27 నాటౌట్) ఫర్వాలేదనిపించారు. భారత ఓపెనర్ స్మృతీ మంధాన 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది. మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1–0తో ముందంజ వేసింది. ఐసీసీ మహిళల చాంపియన్‌షిప్స్‌లో హర్మన్‌ప్రీత్ సేన రెండు పాయింట్లు సైతం ఖాతాలో వేసుకుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68